తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

గురువారం
19 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

పేదలకు 'చేయూత' భరోసా

- నేటి నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పింఛను సొమ్ము జమ
- బోయినపల్లి మండలంలో 567 మందికి మంజూరు పత్రాల పంపిణీ
- కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెల్లడి



బోయినపల్లి, **(జనంసాక్షి):**

ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి నూతనంగా మంజూరైన 567 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను వారు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలపై ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: కలెక్టర్

అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 8,209 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి అర్హులను ఎంపిక చేశామని తెలిపారు. ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ అవుతుందని స్పష్టం చేశారు. ఇంకా అర్హులుంటే ఎంపీడీఓ, పురపాలక కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బోయినపల్లి మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. త్వరలోనే రెండో విడత ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నా, లేకున్నా అందరూ అర్హులేనని, ఆధార్, ఫోన్ నంబరు వివరాలతో గ్రామాలు, వార్డుల్లో నెల రోజుల పాటు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా దాదాపు 5 లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల ఆర్థిక సాయం, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుతో పాటు 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. రూ.12 కోట్లతో స్టేడియం నిర్మాణంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తూ చొప్పదండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శరత్ బాబు, ఎంఆర్ఓ షరీఫ్ మొహియోద్దీన్ , ఇంచార్జ్ఎంపీడీఓ శ్రీధర్, ఏఓ ప్రణీత, ఆర్ ఐ మనోజ్, సూపరింటెండెంట్ వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్లు, వెంకట రామారావు, దుర్గారెడ్డి, వన్నెల మమత రమణరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ రాజేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, బీసీ సెల్ చైర్మన్ కూసా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 జనం సాక్షి:

రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం పాటుపడతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 34, 39వ డివిజన్లలో బుధవారం రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో కేంద్ర నిధులతో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. కార్పొరేషన్ లో ఇటీవల కేటాయించిన 20 లక్షల నిధులతో పాటు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ కేటాయించాలని, దీంతో మరిన్ని పనులు ముందుకు సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, నాయకులు సాయిరాం, పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్తా 2వ పేజీలో



రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్

ఎడపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్?2026 ముగింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జానకంపేటలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్ గారు ముగింపు వేడుకల కోసం ఏర్పాటు చేస్తున్న పరేడ్ గ్రౌండ్ , ప్రధాన వేదిక (స్టేజ్) , అతిథుల గ్యాలరీ , క్రీడాకారులు మరియు పోలీస్ సిబ్బందికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బోధన్ ఎసిపి శ్రీనివాస్, ఐటీ సెల్ ఎసిపి నరేందర్ ,

వార్తా లోపలి పేజీలో

అభివృద్ధి..సంక్షేమ పథకాలు విజయవంతంగా

అమలు చేస్తున్నాం

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్

గోదావరిఖని, జనంసాక్షి :అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తూ విమర్శలకు సమాధానం చెప్తామని రామగుండం ఎం ఎల్ ఎ ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం గోదావరి ఖని చౌరస్తాలో చేయూత కొత్త ఫించన్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమ కార్యక్రమాలకు

వార్తా లోపలి పేజీలో





మూలవిరాట్‌కు అలంకరించిన చందనం తొలగింపు

మల్యాల నవంబర్ 18 (జనం సాక్షి)

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానములో సుమారు 60 సంవత్సరాల అనంతరం నవంబర్ 15 నుండి 20 వరకు నిర్వహిస్తున్న చందనోత్పాదనం (తొలగించడం) మహాసంప్రోక్షణలో భాగంగా బుధవారం స్వామివారి మూలవిరాట్‌కు అలంకరించిన చందనాన్ని శాస్త్రోక్తంగా తొలగించారు. తొలగించిన చందనాన్ని చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ మరియు రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో తూకం వేయగా 99 కిలోల 720 గ్రాములు వచ్చినట్లుగా చందమును పంచనామా నిర్వహించి,తగిన భద్రతా చర్యలతో సీల్ వేసి భద్రపరిచినట్లు ఆలయ ఈవో అంజనా రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈవో అంజనా రెడ్డి,ప్రధానార్చకులు జితేంద్ర ప్రసాద్,చిరంజీవ స్వామి,మారుతీ ప్రసాద్,స్థానాచార్యులు కపిందర్, ఏఈఓ హరిహరనాథ్, పర్యవేక్షకులు సునీల్ కుమార్,పరిశీలకులు అశోక్, లక్ష్మా రెడ్డి,ఏఎస్ఐ రామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

వల్లంపట్లలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు



ఇల్లంతకుంట, నవంబర్ 18 (జనంసాక్షి):ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాల గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, వ్యవసాయంపై వాటి ప్రభావం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు వివరించారు.ఈ గ్రామసభకు మండల తహసీల్దార్ రాచకట్ల సురేష్, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ, ఎంపీడీవో శశికళ హాజరయ్యారు. అలాగే వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల, ఉద్యాన వన, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్, ఉపసర్పంచ్, గ్రామ రైతులు పాల్గొన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని, సంబంధిత శాఖల అధికారుల సూచనలు పాటించాలని అవగాహన కల్పించారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు



ముస్తాబాద్, నవంబర్ 18:విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచించింది.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో యూనిట్ సభ్యులు తెలంగాణ మోడల్ స్కూల్ ముస్తాబాద్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్యానెల్ లాయర్ కడగండ్ల తిరుపతి మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బ తినడం తో పాటు చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడతాయని వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కొండల్ రెడ్డి, అధ్యాపక బృందం, సీనియర్ న్యాయవాది కడగండ్ల తిరుపతి, పారాలీగల్ వాలంటీర్లు కూర సంతోష్, రాజ్ వీర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్-17 ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్‌లో పాల్గొన్న వికేఆర్



ఇల్లంతకుంట, నవంబర్ 18 (జనంసాక్షి):మండలంలోని గాలిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతగిరి సాహిత్య వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గౌరవ మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచనల మేరకు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కబడ్డీ క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు ముఖ్య అతిథికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, వార్డు సభ్యులు కొట్టేపల్లి బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



గోదావరిఖని, జనంసాక్షి :అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో నూతన పెన్షన్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. పెన్షన్ మంజూరు ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులందరికీ నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా సాయంత్రంలోపు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ అవుతుందని తెలిపారు. రాబోయే మూడేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తామని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లిస్తూనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తోందని అన్నారు. ఇప్పటికే అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించామని, దేశంలోని మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు.అంతేకాకుండా సహజ మరణం సంభవించిన సందర్భంలోనూ రూ. 5 లక్షల బీమా అందించేలా ప్రభుత్వం రూ. 3,000 కోట్లతో ప్రత్యేక బీమా పథకాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు.రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట: గోదావరిఖనిలో రూ. 12.50 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం, రూ. 40 కోట్లతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు రూ. 1,000 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అధికారులు, పెద్ద సంఖ్యలో పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పరన్నా జీవులు మీ కల్వకుంట్ల కుటుంబం మే

- **ఎమ్మెల్యే సంజయ్ పై మండిపడ్డ జువ్వాడి**
- **వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు**



మెట్ పల్లి: నవంబర్ 18, జనం సాక్షి :- కేసీఆర్ నుండి కల్వకుంట్ల కుటుంబ మంతా పరాన్న జీవులేనని వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు.మెట్ పల్లి లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ గుండాల దాడి దారుణమన్నారు.మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే ఇద్దరు ఇంటి అవసరాలకే కాకుండా ఫార్మ్ హౌస్ లో కూడా మున్సిపల్ కార్మికులతో పాటు ఖాదీ వర్కర్ లను వాడుకున్నారని మండిపడ్డారు. కిరాయి గుండాలతో దాడులను చేయించిన సంజయ్.. చౌకబారు రాజకీయాలు మానుకోవాలన్నారు.సంజయ్ తన స్థాయికి మించి మాట్లాడుతున్నారని సరికదని పద్ధతి మార్చుకోవాలన్నా రు.గతంలో దోపిడీలు, అక్రమాలకు పాల్పడిన వారిలో కొందరు ఇప్పుడు పెద్ద నాయకులుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఒక్క కాలేజీ ఏర్పాటుకు కృషి చేయలేదని..ఖాది భూములు, పూడూరు, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో భూముల విషయంలో అవినీతి చేసినట్లు విమర్శించారు. ఎమ్మెల్యే జాక్ పాట్ ఎమ్మెల్యే అని అభివర్ణించిన నర్సింగరావు.. నియోజకవర్గంలో భూముల కబ్జా కు పాల్పడ్డరని ఆరోపించారు. మెట్‌పల్లి క్లబ్ ను అమ్ముకున్నారని అందులో విద్యాసాగర్ రావు సంతకం మొదటగా ఉందని గుర్తు చేశారు.ఐటీ, సోషల్ మీడియాను ఆధారంగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, తమ ఉనికిని కాపాడుకునేందుకు రౌడీ రాజకీయాలకు పాల్పడుతూ దాడులకు దిగుతున్నారని అన్నారు.పార్టీ నాయకులపై జరిగిన దాడి విషయంపై న్యాయపరంగా పోరాడుతమని పేర్కొన్నారు.పరన్నా జీవులు అంటే ఎవరు అంటే కెసిఆర్. హరీష్ రావు. కేటీఆర్ అని అన్నారు. వారు వారి సొంత నియోజకవర్గం కాకుండా ఇతర నియోజకవర్గం పోటీ చేస్తున్నారు అన్నారు.గతం లో మీ నాన్న గారు కుడా ఇబ్రహీంపట్నం నుండి జడ్పీటీసీ చేసిన సంగతి గుర్తు లేదా అని అన్నారు.గతం లో ఎమ్మెల్సి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేసి అప్పటి ఇప్పటి పార్టీ నుండి సస్పెండ్ అయింది మీ నాన్న విద్యాసాగర్ రావు అని మర్చిపోయావ ఎమ్మెల్యే సంజయ్ అని అన్నారు. చిల్లర రాజకీయం చేయడం ఇకనైనా మానుకో ఎమ్మెల్యే సంజయ్ అని జువ్వాడి నర్సింగ్ రావు అన్నారు.ఈ సమావేశం లో కోరుట్ల, మెట్ పల్లి మున్సిపల్ చేర్మెన్ లు తిరుమల వసంత గంగాధర్, మైలారపు లింబాద్రి. కౌన్సిలర్లు కోరుట్ల మండలం. కోరుట్ల పట్టణ, మెట్ పల్లి పట్టణ, మెట్ పల్లి మండలం అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల అధ్యక్షులు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు జలపతి రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ లో వివిధ హోదాలో వున్నా నాయకులు పాల్గొన్నారు..

ముగిసిన కోల్ క్వాలిటీ అస్యూరెన్స్ వీక్-2026

- **నాణ్యమైన బొగ్గు సరఫరాతోనే సంస్థ మనుగడ**
- **సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు**



గోదావరిఖని, జనంసాక్షి :సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నవంబర్ 12 నుండి 18 వరకు నిర్వహించిన "కోల్ క్వాలిటీ అస్యూరెన్స్ వీక్ - 2026" ముగింపు వేడుకలు రామగుండం ఏరియా-1 గోదావరిఖని ఇల్లందు క్లబ్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా, ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ విశిష్ట అతిథిగా హాజరుకాగా, క్వాలిటీ మేనేజ్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎ. రవికుమార్ అధ్యక్షత వహించారు. మొదట ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "వినియోగదారులే సింగరేణి సంస్థకు అత్యంత ముఖ్యమని, వారికి ఒప్పందం ప్రకారం నిర్దేశిత గ్రేడ్, నాణ్యమైన బొగ్గును సరఫరా చేసినప్పుడే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని" స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జి.ఎం (క్వాలిటీ మేనేజ్‌మెంట్, కార్పొరేట్) ఎ. రవికుమార్ క్వాలిటీ నివేదికను సమర్పిస్తూ, సంస్థ చేపడుతున్న నాణ్యతా ప్రమాణాలు, సర్వేస్ మైనర్ల వినియోగం, కొత్త కోల్ వాషరీల ఏర్పాటు మరియు ఎన్ ఎ బి ఎల్ గుర్తింపు పొందిన ప్రయోగశాలల పనితీరును వివరించారు. అనంతరం వివిధ విద్యుత్ సంస్థల (ఎన్టిపిసి, టీ.జి. జెన్‌కో, కే.టీ.పీ.పీ, యాదాద్రి, కేటీపీఎస్, బీ.టీ.పీ.ఎస్), మహా జెన్‌కో, నవభారత్ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ గతంతో పోలిస్తే సింగరేణి బొగ్గు నాణ్యతలో గణనీయమైన మెరుగుదల కనిపించిందని ప్రశంసిస్తూ, రవాణా, శాంప్లింగ్ విషయంలో పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు డి. లలిత్ కుమార్ (ఆర్జీ-1), డాక్టర్ సుజయ్ మజుందార్ (జి.ఎం క్వాలిటీ, కొత్తగూడెం), జె. వెంకటరమణ (జి.ఎం క్వాలిటీ, ఆర్జీ రీజియన్), ఎస్. మధుసూదన్ (ఆర్జీ-3), కె. నాగేశ్వరరావు (ఎ.ఎల్.పి), ఎం. శ్రీనివాస్ (ఎస్.ఆర్.పి), ఎం. శ్రీరమేష్ (బీపీఏ), కె.ఎస్.ఎన్. రాజు (ఎస్టీపీపీ), ఎన్. రాధాకృష్ణ (మందమర్రి), ఎ. రాజేశ్వరరెడ్డి (భూపాలపల్లి), వివిధ ఏరియాల ఏజెంట్లు, ప్రాజెక్టు ఆఫీసర్లు, గనుల మేనేజర్లు, క్వాలిటీ విభాగ అధికారులు, సి.హెచ్.పి ఇంచార్జ్‌లు, వివిధ కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కోల్ క్వాలిటీ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రథమ బహుమతి ఆర్జీ-3 ఏరియా, ద్వితీయ బహుమతి శ్రీరాంపూర్ ఏరియా, తృతీయ బహుమతి బెల్లంపల్లి ఏరియాల జి.ఎం.లు మరియు సంబంధిత శాఖల అధికారులకు ముఖ్య అతిథి డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో రూ.5 లక్షల ఆర్థిక భరోసా

- అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం వర్తింపు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనం సాక్షి)రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఒక సంపాదించే వ్యక్తిని బీమా పరిధిలోకి తీసుకోవాలని సూచించారు. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందించాలని తెలిపారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు.గ్రామాలు, పట్టణాలు, వార్డుల వారీగా ప్రత్యేక నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు సైతం ప్రత్యేక దరఖాస్తు విధానం ద్వారా అవకాశం కల్పించాలని సూచించారు. ఆధార్, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. మీ సేవ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తుల నమోదు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సిద్దిపేటలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో పథకం అమలుకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపడతామన్నారు. నమోదు శిబిరాల్లో ఇంటర్నెట్, ప్రింటర్, స్కానర్ వంటి సాంకేతిక సదుపాయాలు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మున్సిపల్ అధికారుల సమన్వయంతో అర్హులైన ప్రతి కుటుంబాన్ని పథకంలో నమోదు చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, సీపీఓ జి. రఘునందన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన రుద్రంగి కృష్ణవేణి విద్యార్థిని దీక్షిత




రుద్రంగి, నవంబర్ 18 (జనం సాక్షి):రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని నారవేణి దీక్షిత రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయిలో జరిగిన ఎన్నికల సాక్షరత క్లబ్ ల ఆధ్వర్యంలో, జిల్లా పరిపాలన, ఎన్నికల విభాగం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రతిభ కనబరిచింది. జిల్లా స్థాయి ఎంపికలో 10 మంది విద్యార్థుల జాబితాలో చోటు దక్కించుకున్న పాఠశాల విద్యార్థినిగా నిలిచింది.ఈ సందర్భంగా డీఈఓ విద్యాసాగర్ విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే ఎంఈఓ రామకృష్ణ,పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రాజ్, కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్,యాజమాన్యం తీపి రెడ్డి వెంకట్ రెడ్డి,ఎర్రం గంగ నరసయ్య,పడాల సురేష్, ఉపాధ్యాయులు విద్యార్థిని దీక్షితను ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి ఎన్నిక కావాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, నూతన పింఛన్ పత్రాల పంపిణీ



రుద్రంగి, నవంబర్ 18 (జనం సాక్షి) రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు, నూతన పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను, నూతన పింఛన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందించి వారికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, మాజీ యూనియన్ చైర్మన్ బోనాల మోహన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గండి నారాయణ,ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, ఫ్యాక్స్ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రం గంగ నరసయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, నూతన పింఛన్ పత్రాలు పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని, నవంబర్ 18, (జనంసాక్షి) : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటూ, కుటుంబ సభ్యుల్లా కడుపున పెట్టుకొని చూసుకుంటుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ఐటీ, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.మంథని అధ్వర్యంలో మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీరాం నగర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహెందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ లు ప్రారంబించగా, విలోచవరం కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండలంలోని మైదుపల్లి, గుమ్మూర్, తోట గోపయ్య పల్లి, లక్కెపూర్, మహా భూబ్ పల్లి, నగరం పల్లి, పుట్టపాక, పోతారం, మల్లేపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు పంతంగి లక్ష్మన్, చెరుకుతోట సురేష్, దొబ్బల రమేష్, ఇసంపల్లి లక్ష్మి- శ్రీనివాస్, న్యాతరి లత-శ్రీనివాస్, కన్నూరి రాజబాబు, ఎడ్ల ఆదిత్య, లక్కాకుల సత్యనారాయణ లు ప్రారంబించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడి మోసపోవద్దని, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం ధరలను తగ్గించే ప్రయత్నం చేస్తే రైతులకు అండగా నిలిచి ఆదుకోవడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎక్కడ ఉన్నా ప్రతిరోజూ సుమారు 18 గంటల పాటు పనిచేస్తూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలనే విషయంపై నిరంతరం ఆలోచిస్తూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను ముఖ్యమంత్రి హోదాలో చూడాలని ప్రజల ఆకాంక్షను అయన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,441 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర తో పాటు రూ500 బోనస్ పొందాలని సూచించారు.ప్రపంచ దేశాలు ఈ కార్యక్రమాల్లో సంఘ డైరెక్టర్లు సిరిమూర్తి ఓదెలు, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి- మొండయ్య, దేవల్ల విజయ్ కుమార్, కార్యదర్శి బొద్దుల సమ్మయ్య, ఏఈఓ జి.హారిక, మున్సిపల్ కౌన్సిలర్ ఎల్లంకి వంశీధర్, పెంటరి రాజు, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాదేవి-సురేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కొమ్మిడి స్వరూప్, నాయకులు జాగిరి సదానందం, తొగరి ఓదెలు, వేల్పుల రాజు, ఎడ్ల శ్రావణ్, సవాయి గణేష్, శీలం ప్రభాకర్, మేదరవేన పర్వతాల్ యాదవ్, కేతం లక్ష్మి- రమేష్, అప్పని రాజు, పెట్టేం రామస్వామి, పొనగంటి రమేష్, బొందుగుల అంజయ్య, తొగరి సురేష్, నౌండ్ల సదానందం, కన్నూరి స్నేహ- సంతోష్, బూడిద రాజయ్య, తూండ్ల లక్ష్మి, ఎడ్ల ప్రమీల, కోరవేని రవి, రాగం శ్రీనివాస్, కాసిపేట ప్రశాంత్, రాయమల్లు, తాళ్ళపల్లి సత్యనారాయణ, ముస్కుల రాజిరెడ్డి, పెండ్రి తిరుపతి రెడ్డి, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, హమాలి సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు, రైతులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



ముస్తాబాద్ నవంబర్ 17(జనం సాక్షి)ముస్తాబాద్ మండలాల్లో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మండలం నామాపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని, నిర్దేశించిన తేమ శాతం వచ్చిన తర్వాతే తూకం వేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. (భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన)గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన భూముల రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికారుల బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. తాసిల్దార్ ఎండి ఫారూఖ్, ఆర్ ఐ , ఐకెపి ఎపిఎం, రాజనర్సు, శోభన్ బాబు, మహిళా సంఘ గ్రూప్ లీడర్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నెల గడుస్తున్న ధాన్యం కొనుగోలు కొనసాగడం లేదు

రైతు చుంచు మల్లన్న



ముస్తాబాద్ నవంబర్ 17 (జనం సాక్షి)ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ అధికారులు ఆగమేఘాల మీద కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు ఈ సందర్భంగా చుంచు మల్లన్న రైతు మాట్లాడుతూ దాదాపు నెల గడుస్తున్న ఇప్పటివరకు కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, రైతులకు ఇబ్బంది కరంగా ఉంది, రైతులు దళారులను నమ్మి , రైస్ మిల్ వారిని నమ్మి రైతు పండించిన ధాన్యాన్ని రైతు చెప్పినంత ధర కాదు, రైస్ మిల్ నిర్వాకులు చెప్పిందే వేదం మీ ఇష్టం ఉంటే అమ్మండి లేకపోతే లేదు, అని కడకడిగా చెప్పేస్తున్నారు, ధర్మకాండలో కూడా మోసం, అధికారుల పర్యవేక్షణ కరు వైంది, చూసేవారు లేరు ఇక పట్టించుకునేది ఎవరు రైతులు ఏమి చేయలేక దళారులు ఇచ్చినంత తీసుకొని ఆవేదనతో ఇంటిదారి పడుతున్నారు, ఏమి చేయలేక కనీసం రైతు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు, కొనుగోలు కేంద్రాలలో వడ్లు పోసి తాడిపత్రి కిరాయి ఓ పక్క కూలీల మోత మోయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు, ఇదే విధంగా కొనసాగితే రైతులు ప్రభు త్వానికి సరైన గుణపాఠం చెప్పే సమయం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు,

లబ్ధిదారులకు పింఛను మంజూరు పత్రాలు అందజేసిన సర్పంచ్



గంగాధర నవంబర్ 18 (జనంసాక్షి):మండలంలోని కాసారం గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ వేముల జ్యోతి దామోదర్ లబ్ధిదారులకు పింఛను మంజూరి పత్రాలను అందజేశారు .గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామంలోని అర్హులైన చేనేత,వితంత్, వికలాంగులు,గీత కార్మికులకు పింఛన్ల మంజూరి పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,పంచాయతీ కార్యదర్శి మరియు వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్దెల రాజేందర్‌కు రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ ఉపాధ్యక్షుడిగా నియామకం



కోనగర్ టౌన్, నవంబర్ 18, (జనం సాక్షి)కరీంనగర్‌కు చెందిన మద్దెల రాజేందర్‌ను తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆటో కార్మిక కుల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ, కరీంనగర్ జిల్లాలో మండల కమిటీల నిర్మాణానికి కృషి చేసిన రాజేందర్ సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి ఆటో కార్మికుల సంఘటిత ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సూచించారు. తన నియామకంపై మద్దెల రాజేందర్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారా నికి, సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

యువతకు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన అవసరం : అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనం సాక్షి)ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, రాజ్యాంగం కల్పించిన ఈ అమూల్యమైన హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని అదనపు జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ అన్నారు. బుధవారం కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఓటర్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో యువత భాగస్వామ్యం కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ప్రాముఖ్యతపై యువతకు అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, డీఈఓ మల్లికార్జున్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల విద్యార్థులు పాల్గొన్నారు.

కొమలంచలో కల్తీ కల్లు విక్రయాలపై పోలీసుల దాడులు

నిజాంసాగర్: కొమలంచ గ్రామంలో కల్తీ కల్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రౌతు అంజా గౌడ్, రౌతు లక్ష్మా గౌడ్‌లకు సంబంధించిన కల్లు దుకాణాలపై పోలీసులు తనిఖీలు చేపట్టారు.దీంతో కల్తీ కల్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై కొమలంచ గ్రామానికి చెందిన కల్లు దుకాణాల యజమానులు రౌతు అంజా గౌడ్, రౌతు లక్ష్మా గౌడ్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ వెల్లడించారు. గ్రామంలో కల్తీ కల్లు విక్రయాలపై నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే సంజయ్ నివాస ముట్టడికి కాంగ్రెస్ నాయకుల యత్నం అప్రజాస్వామికం

కాంగ్రెస్ నాయకుల తీరుపై బీఆర్ఎస్ నాయకుల తీవ్ర ఆగ్రహం



మెట్‌పల్లి: నవంబర్ 18, జనం సాక్షి :- కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించడం పూర్తిగా అప్రజాస్వామికమని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై దాడులకు దిగడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసుల సూచనలను గౌరవిస్తూ ఎంతో సంయమనంతో, క్రమశిక్షణతో వ్యవహరించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ నాయకులు తమ అనుచరులను వెంటబెట్టుకుని వచ్చి ఉద్రిక్తతలకు కారణమయ్యారని ఆరోపించారు. జువ్వాడి నర్సింగరావు ఒకసారి సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు.కోరుట్ల పట్టణంలోని చారిత్రాత్మక గడీ బురుజు స్థలాన్ని కబ్జా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎమ్మెల్యే సంజయ్ అడ్డుకుని, మున్సిపల్ కమిషనర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేశారని వివరించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలను జీర్ణించుకోలేక ఆయనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.నియోజకవర్గంలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అవినీతి, మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి, పెద్ద చెరువు నుంచి నీటి విడుదలతో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మెట్‌పల్లి మున్సిపాలిటీకి వచ్చిన రూ.18 కోట్ల నిధుల వినియోగంపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు.గత 13 ఏళ్లుగా డాక్టర్‌గా, ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే సంజయ్ ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో వైద్య సేవలు, వ్యాక్సిన్లు, వెంటిలేటర్ల అందుబాటుకు కృషి చేసి ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇటీవల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో భారీ జాబ్ మేళా నిర్వహిస్తే దానిని కూడా కాంగ్రెస్ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని అన్నారు.మెట్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ వసూళ్లు, అధికారుల బదిలీల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప వ్యక్తిగత దాడులు, బెదిరింపులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కక్షపూరిత రాజకీయాలను పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు భయపెట్టాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



తంగళ్ళపల్లి,నవంబర్ 18, జనం సాక్షి.తంగళ్ళపల్లి మండలం సారంపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా బాధ్యతలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు . ఈ సందర్భంగా విద్యార్థి గుగ్గిళ్ల శ్రీఖర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) గా, నల్లోండ చరణ్ ప్రధానోపాధ్యాయుడు (హెచ్.ఎం) గా, తోకల అఖిల్ శ్రియాన్స్ పీఈటీగా వ్యవహరించారు . ఈ సందర్భంగా ఎంఈవో వ్యవహరించిన గుగ్గిళ్ల శ్రీఖర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పని తీరు పై ఆరా తీసారు . విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు . పాఠశాలలో కొద్దిసేపు తన గొంతుతో పాటల పాడి విద్యార్థులల్లో,పాఠశాల ఉపాధ్యాయులలో ఉత్సాహాన్ని నింపారు . విద్యార్థులందరూ పాఠశాలకు ప్రతిరోజు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు . మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంఘం రాజేష్ మాట్లాడుతూ ,ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల నిర్వహణ , తరగతుల బోధన, హాజరు నమోదు, క్రీడా కార్యక్రమాలు తదితర బాధ్యతలను విద్యార్థులే స్వయంగా నిర్వహించారని పాఠశాలను ఎలా నడపాలి , బాధ్యత అంటే ఏమిటో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారని తెలిపారు . విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు , ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని , విద్యార్థులు అద్భుతంగా బాధ్యతలు నిర్వహిం చారని వారు కొనియాడారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుడం ప్రశాం తి , వీ వీ గుగ్గిళ్ల భవాని , విద్యార్థులు , తల్లిదండ్రులు , తదితరులు పాల్గొన్నారు

గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం.. ప్రభుత్వ పాఠశాలను కూలగొట్టడం దుర్మార్గం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, సెప్టెంబర్ 18, (జనంసాక్షి) : తాను వచ్చినప్పుడల్లా విలాసాలు అనుభవించడానికి గెస్ట్ హౌజ్ కట్టుకోవడానికి ప్రభుత్వ పాఠశాలను కూలగొట్టించిన ఘన చరిత్ర మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌దేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల స్థితిగతులపై అక్కడి హెచ్ఎంతో మాట్లాడి, ఎంఈఓలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 80 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత బీసీల, ఎస్సీ, ఎస్టీల పరిస్థితి ఎలా ఉందో కూచిరాజ్ పల్లి ప్రాథమిక పాఠశాల చూస్తే అర్థం అవుతుందన్నారు. ఒక కుటుంబానికి 40 ఏండ్ల అవకాశం ఇస్తే సాధించిన ఘనకీర్తి ఏంటంటే ఇంకా ఊరు బయటనే మా జీవితాలు... అరుగు మీదనే మా చదువులు... రోడ్డు మీదనే మా బతుకులు అన్న చందంగా ఉన్నాయన్నారు. మంచిగా ఉన్న స్కూల్‌ను కూలగొట్టించి గెస్ట్ హౌజ్ నిర్మాణం చేపట్టాలని చూస్తున్నారని, అయితే ప్రస్తుతం కూలగొట్టిన స్కూల్‌కు ఎక్కడ స్థలం కేటాయించారో, ఎప్పుడు స్కూల్ నిర్మాస్తారో, ఎన్ని నిధులు మంజూరయ్యాయో ఎవరికి తెలియదని ఆయన అన్నారు. పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక ప్రణాళిక లేదని, అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దౌర్భాగ్యమన్నారు. ఇక్కడి పాఠశాలలో చదువుకునే వాళ్లలో ఎక్కువగా ఎస్సీలు, బీసీలే ఉన్నారని, ఎమ్మెల్యే కుటుంబానికి చెందిన అక్కా చెల్లెల్ల పిల్లలు చదువుకుంటే అర్థం అయ్యేదని అన్నారు. 80 ఏండ్ల స్వాతంత్ర్యాన్ని గొప్పగా జరుపుకుంటున్న ఈ దేశంలో రాజ్యాంగం పుస్తకం పట్టుకుని తిరుగుతున్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. తండ్రి ఆశయాల కోసం రాజకీయాల్లోకి వచ్చామని పదేపదే చెప్పే దుద్దిళ్ల శ్రీధర్ కూచిరాజ్‌పల్లి పాఠశాల విషయంలో ఏ జవాబు చెప్తాడని ప్రశ్నించారు.మంథనికి జేఎన్‌టీయూ కళాశాలను తీసుకువచ్చి ఏనాడు చూడని డ్రగ్స్‌ను ఈ ప్రాంతానికి పరిచయం చేశాడని, ఇక బీఫార్మసీ కాలేజీ వస్తే ఎన్ని ఇబ్బందులు ఎదురువుతాయని ప్రశ్నించారు. బీఫార్మసీ వస్తే రాష్ట్రంలోని మెరిట్ విద్యార్థులకే అవకాశం వస్తుందని మంథనిలోని పేద విద్యార్థులకు ఏం మేలు జరుగుతుందన్నారు. మా పిల్లలకు బేస్మెంట్ లాంటి అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు, సౌకర్యాలు కల్పించకుండా నీకు విలాసవంతమైన జీవితాన్ని గడుపు కోవడానికి వాహనం ఆపి మూత్రం పోవడానికి గెస్ట్ హౌజ్ కట్టుకోవడానికి పిల్లల స్కూల్ కూలగొట్టించాడని విమర్శించారు. ఇప్పటికైనా మంథనిలోని షోకాల్డ్ మేధావులు ఆలోచన చేయాలని, మనం నిలదీయక పోవడం, ప్రశ్నించక పోవడంతోనే ఇలాంటి అరాకచకాలకు పాల్పడుతున్నారని ఆయన ఈ సంద ర్భంగా స్పష్టం చేశారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

జువ్వాడి నర్సింగ్ రావు

ఇబ్రహీంపట్నం మండలంలో 106 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



ఇబ్రహీంపట్నం నవంబర్ 18 జనం సాక్షి : పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు అన్నారు.ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 106 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కేవలం నివాసం మాత్రమే కాదని, ప్రతి పేద కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. పదేళ్ల పాలనలో కనీసం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేని పరిస్థితి గత ప్రభుత్వంలో నెలకొందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల వంటి పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జువ్వాడి నర్సింగ్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్ (ఎంఆర్ఓ), ఇతర ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఐదు రోజుల పాటు విశేష పూజలు



ముస్తాబాద్ నవంబర్ 17 (జనం సాక్షి)కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి పీఠం ముస్తాబాద్ మండల కేంద్రానికి చేరుకోవడంతో భక్తులలో ఆధ్యాత్మిక ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య మహిళా సభ్యులు ఐదు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారిని కొలిచారు. ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తూ భక్తితో సేవలు సమర్పించారు.కార్యక్రమం చివరి రోజున అమ్మవారి విగ్రహానికి అత్యంత వైభవంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళహారతుల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తింది. అమ్మవారి అనుగ్రహం ఆర్యవైశ్య కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు.అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తితో అమ్మవారికి పూజలు నిర్వహించడమే కాకుండా, అన్నదానం ద్వారా సేవాభావాన్ని చాటుకోవడం ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఐదు రోజుల పాటు మహిళా సభ్యులు చూపిన భక్తి, ఐకమత్యం, సమష్టి కృషి ఆర్యవైశ్యుల ఆధ్యాత్మిక సంప్రదాయాలకు అద్దం పట్టింది.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంతోష్, అధ్యక్షులు బిక్షపతి, కమిటీ సభ్యులు విజయ్ కుమార్, చంద్రం, సత్తయ్య, రమేష్, భూమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజు, బాలరాజు, శంకరయ్యతో పాటు సంఘ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి,ఐకమత్యం, సేవాభావం కలగలిసిన ఈ వేడుకలు ముస్తాబాద్ ఆర్యవైశ్యులలో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

పేదలకు 'చేయూత' భరోసా

- **బోయినపల్లి మండలంలో 567 మందికి మంజూరు పత్రాల పంపిణీ**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెల్లడి**



బోయినపల్లి, నవంబర్ 18 (జనం సాక్షి)సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి నూతనంగా మంజూరైన 567 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను వారు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలపై ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: కలెక్టర్అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 8,209 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి అర్హులను ఎంపిక చేశామని తెలిపారు. ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ అవుతుందని స్పష్టం చేశారు. ఇంకా అర్హులుంటే ఎంపీడీఓ, పురపాలక కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బోయినపల్లి మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. త్వరలోనే రెండో విడత ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నా, లేకున్నా అందరూ అర్హులేనని, ఆధార్, ఫోన్ నంబరు వివరాలతో గ్రామాలు, వార్డుల్లో నెల రోజుల పాటు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యేఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా దాదాపు 5 లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల ఆర్థిక సాయం, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుతో పాటు 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. రూ.12 కోట్లతో స్టేడియం నిర్మాణంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తూ చొప్పదండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శరత్ బాబు, ఎంఆర్ఓ షరీఫ్ మొహియోద్దీన్ , ఇంచార్జ్ఎంపీడీఓ శ్రీధర్, ఏఓ ప్రణీత, ఆర్ ఐ మనోజ్, సూపరింటెండెంట్ వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్లు, వెంకట రామారావు, దుర్గారెడ్డి, వన్నెల మమత రమణరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ రాజేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, బీసీ సెల్ చైర్మన్ కూసా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై బీజేపీ మహా ధర్నా



గంభీరావుపేట నవంబర్ 18 జనం సాక్షి::రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల రైతులకు రబీ పంట సాగు కోసం ఎగువ మానేరు జలాశయం, చెరువుల నుంచి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో రైతు మహా ధర్నా నిర్వహించారు.సాగునీరు విడుదల చేయలేని పక్షంలో గంభీరావుపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు.పంటలు సాగు చేయలేని రైతులకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, కరువు సహాయక నిధులు అందించాలని కోరారు.అలాగే రైతుల రుణాల చెల్లింపులకు గడువు ఇవ్వాలని, మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మారుతిరెడ్డి, స్థానిక ఎస్సై బాలరాజు ధర్నా స్థలానికి చేరుకొని బీజేపీ నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్‌తో, గంట అశోక్, దేవేందర్, సర్వోత్తమ్, పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ

ప్రతి కుటుంబానికి 5 లక్షల బీమా

ఎంపీడీవో శ్రీజా రెడ్డి



మంథని, నవంబర్ 18 (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతుందని మంథని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీజా రెడ్డి తెలిపారు.ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా కల్పించడమే ఈ పథక ప్రధాన లక్ష్యమని, కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించినప్పుడు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడమే ఉద్దేశమని తెలిపారు .కుటుంబాన్ని పోషించే 18-59 ఏళ్ల వయస్సు గల సభ్యుడు బీమా పొందే వ్యక్తిగా ప్రతిపాదించబడతారని, వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డు ప్రతిని ప్రాథమికంగా తీసుకుంటారని తెలిపారు.ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న పథకాన్ని ప్రారంభించి, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు ఆధార్, రేషన్ కార్డు, కుటుంబ సభ్యులు వచ్చి నామిని వివరాలు ధ్రువీకరించాలని, రేషన్ కార్డు లేని వారు ఆధార్ ఓటీపీ తో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

నాగారంలో మిషన్ భగీరథ అధికారుల విస్తృత తనిఖీలు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు



కమాన్‌పూర్, నవంబర్ 18, (జనం సాక్షి) : రానున్న వేసవి మరియు ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నాగారం గ్రామ పంచాయతీలో మిషన్ భగీరథ అధికారులు బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సర్పంచ్ పొనగంటి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో మిషన్ భగీరథ అంతర్గత సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రణవ్, పంపిణీ వ్యవస్థ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ నిత్య, ఉప సర్పంచ్ ఓద్నాల శ్రీనివాస్ , వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ సాగి శ్రీధర్ రావు పాల్గొన్నారు. గ్రామంలోని మిషన్ భగీరథ పంపిణీ వ్యవస్థ నీటి సరఫరాతో పాటు, స్థానిక నీటి వనరులైన బావులు, బోరుబావులు, చేతిపంపుల పనితీరును వారు క్షుణ్ణంగా పరిశీలించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులు సిబ్బందికి సూచించారు. వేసవిలో ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పొనగంటి కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

36వ డివిజన్‌లో అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్

ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేసిన కార్పొరేటర్ తోట అనిల్



కరీంనగర్, క్రైమ్ నవంబర్ 18 (జనంసాక్షి): 36వ డివిజన్‌లో నూతనంగా పెన్షన్ మంజూరైన అర్హులైన లబ్ధిదారులకు డివిజన్ కార్పొరేటర్ తోట అనిల్ ఈరోజు పెన్షన్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ తోట అనిల్ మాట్లాడు తూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా అందాలనే లక్ష్యంతో తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆసరాగా నిలిచే ఈ పెన్షన్ల మంజూరు వారి కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు.డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి మరియు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి ఇంటికీ చేరేలా తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఆయన స్పష్టం చేశారు. పెన్షన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు తమ కష్టాలను గుర్తించి సకాలంలో పెన్షన్ మంజూరు చేయించిన కార్పొరేటర్ తోట అనిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేట గ్రామంలో కేతు బచావో కార్యక్రమం



మల్యాల నవంబర్ 18 (జనం సాక్షి) మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో బుధవారం కేత్ బచావో అభియాన్,పంటలపై ఏలినినో ప్రభావం మరియు యాసంగిలో ఆరుతడి పంటలపై అవగాహన కార్యక్రమము మండల ఏవో కే.చంద్ర దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏలినినో ప్రభావము యాసంగిలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున వరికి బదులు ఆరుతడి పంటలు అయిన వైపు మల్లా లని ,రైతులు ఉద్యానవన శాఖ క్రింద తక్కువ నీటితో,తక్కువ రోజులు పంట అయిన కూరగాయలు పండించి ఆదాయం పొందాలని, రైతులు సోలార్ ఫెన్సింగ్ మరియు డ్రిప్ పరికరాల రాయితీ కొరకు ఉద్యానవన శాఖను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దారం ఆదిరెడ్డి, ఏఈఓ శ్రీలేఖ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

కరీంనగర్ అడ్వకేట్స్ సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ల సేవలు ప్రారంభం



కరీంనగర్ లీగల్, నవంబర్ 18 (జనంసాక్షి):కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలోని కరీంనగర్ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీలో తొలిసారిగా షూరిటీ అవసరాల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ల సేవలను బుధవారం ప్రారంభించారు. సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ గడ్డం లక్ష్మణ్ చేతుల మీదుగా తొలి ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ఇద్దరికి అందజేశారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ, సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ల సేవలను ప్రారంభించేందుకు అనుమతించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవలు న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, భవిష్యత్తులో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.సొసైటీ జనరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ, న్యాయవాదుల సౌకర్యార్థం ప్రారంభించిన ఈ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ నూతన సేవల ప్రారంభంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ట్రెజరర్ సుంకే దేవకిషన్, సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత బోయిని బాబుకు ఘన సన్మానం

అభినందించిన సిద్దిపేట ఏసీపీ గడ్డం సదన్ కుమార్



చిగురుమామిడి నవంబర్ 18(జనంసాక్షి):న్యూఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ ద్వారా ఇటీవల ప్రతిష్టాత్మక “అంబేద్కర్ నేషనల్ అవార్డు” అందుకున్న యువ నాయకుడు బోయిని బాబును సిద్దిపేట ఏసీపీ (సీసీఎస్) గడ్డం సదన్ కుమార్ తదితరులు ప్రత్యేకంగా అభినందించి,ఘనంగా సన్మానించారు.ఈ అవార్డు రావడాన్ని పురస్కరించుకుని చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ భావజాల వ్యాప్తి కోసం బోయిని బాబు గత దశాబ్ద కాలంగా విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రదానం చేయడం తమ ప్రాంతానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాణా ప్రతాప్ సింగ్, గొట్టి రఘుబాబు, వివిధ పార్టీల నాయకులు ఠాకూర్ నరేందర్ సింగ్, బోయిని ఆది మల్లయ్య, బోయిని సతీష్, బోయిని విజయ్ కుమార్, బోయిని మనోజ్, బోయిని వంశీకృష్ణ, బోయిని సురేష్, శంకర్, ఉమేష్, రఘు, పందిపెల్లి మహేష్, సంపత్, రాజయ్య, లింగయ్య, ఎనగందుల సంజీవ్, ఆంజనేయులు, నితిన్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం.. పేదలకు పింఛన్లతో ఆర్థిక భరోసా

మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



శంకరపట్నం, నవంబర్ 18 (జనం సాక్షి):ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకాన్ని అమలు చేస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. విద్యార్థులు ఉదయం ఆకలితో పాఠశాలలకు వచ్చి చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా, ఆరోగ్యంగా ఉంటూ విద్యలో రాణించేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.బుధవారం శంకరపట్నం మండలం కేశవపట్నం మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించే విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, వంట సిబ్బంది పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన భోజనం సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.అనంతరం శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఇందిరా క్యాంటీన్ల ఏర్పాటు, ఆర్టీసీకి నూతన బస్సుల కొనుగోలు వంటి కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు.అలాగే అర్హులైన పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తూ ఆర్థిక భారాన్ని తగ్గిస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన నిరుపేదలకు చేయూత పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని పేద, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీఓ పీడీ గీత, మండల ప్రత్యేక అధికారి అనిల్, స్థానిక సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో అనిత, ఎంఈవో లక్ష్మీనారాయణ, ప్యాక్స్ చైర్మన్లు గాజుల మహేష్, గోపగోని బసవయ్య, కీసర సంపత్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సొమ్ము పక్క దారి పడుతుందా

వెల్గటూర్ సహకార సంఘం లావాదేవీలపై సహ చట్టం ధరఖాస్తు



వెల్గటూర్,నవంబర్ 18(జనం సాక్షి): వెల్గటూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెలువుడుతున్నాయి. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గంద్ర శ్రీకాంత్ రావు సహకార సంఘంలో జరిగిన లావాదేవీలు, జమా ఖర్చులపై సమాచార హక్కు చట్టం కింద జిల్లా సహకార అధికారికి ధరఖాస్తు చేశారు, ఈ నేపథ్యం లో అసంపూర్తి సమాచారం ఇచ్చి సహకార సంఘాలు సమాచార హక్కు చట్టం పరిధి లోకి రావని సమాధానం ఇచ్చినట్లు వారు తెలిపారు. వారు ఇచ్చిన అసంపూర్తి సమాచారం లోనే సహకార సంఘ భవనం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సహకార సంఘం నిర్వహణ ఖర్చుల పేరుతో కోట్ల రూపాయల నిధులను, నిర్వహణ ఖర్చుల లెక్కల్లో చూపించినట్లు ఆరోపించారు. నూతన సంఘ భవనం నిర్మాణానికి సుమారుగా కోటి రూపాయలు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కానీ సంఘ నిర్మాణానికి కొనుగోలు చేసిన ఇసుకను బయట మార్కెట్లో అక్రమంగా విక్రయించిన వారు ఎవరో తెలపాలని ప్రశ్నించారు. నూతన సంఘ భవనం నిర్మానానికి సుమారు కోటి రూపాయల ఖర్చు చూపించారు కానీ వాస్తవంగా భవనం నిర్మానణానికి అంత ఖర్చు ఎలా అవుతుందని తప్పుడు ఎస్టిమేషన్ తో ఎంబీ రికార్డ్ చేసి నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. అలాగే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు గత ఐదేళ్ల కాలంలో ఖరీఫ్, రబీ సీజన్లో కలిపి 16 నుంచి 18 లక్షల వరకు ఒక సంవత్సరంలో ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఇలా ఇదేళ్ల కాలంలో సుమారు 85 లక్షల ఖర్చులు చూపించారు. చేయని పనులను చేసినట్లు చూపించి తప్పుడు లెక్కలతో లక్షల రూపాయల నిధులు స్వాహా చేసినట్లు ఆరోపించారు. గన్నీ సంచుల వ్యవహారంలోనూ తేడాలు ఉన్నట్లు, గన్నీ సంచుల తరుగు కింద వేల రూపాయలు సంఘానికి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. బాధ్యతా రాహిత్యంతో గన్నీ సంచుల తరుగు కింద వచ్చిన నష్టానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. నిర్వహణ ఖర్చుల్లోను భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలు జరుగుతున్నా ప్రతి సంవత్సరం ఆడిట్ నిర్వహిస్తున్న, ఈ అక్రమాలను అధికారులు ఎక్కడ బహిర్గతం చేయడం లేదనీ. సమాచార హక్కు చట్టం కింద సహకార సంఘాలు రావనే సాకుతో లక్షల రూపాయల నిధులు స్వాహా చేసినా ఎవరికీ తెలియదనే ధైర్యం తో అక్రమాలకు పాల్పాడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏన్నో పథకాలు పెట్టి రైతులను ఆదుకోవాలని చూస్తుంటే రైతుల సహకారంతో నడిచే సహకార సంఘాల్లో అమాయక రైతుల సొమ్ము రాబందుల్లా దోచుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు స్పందించి వెల్గటూర్ పీఏసీఎస్ పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని, రైతుల సొమ్ము కాపాడి సంఘ అభివృద్ధికి పాటుపడాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే సంజయ్ ఇంటి ముట్టడి హేయమైన చర్య

రాజకీయ ఘర్షణలు మాని రైతుల సమస్యలు పరిష్కరించండి : బీజేపీ జిల్లా వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ గంగాసాగర్



మెట్‌పల్లి: నవంబర్ 18 జనం సాక్షి :- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ పార్టీ పిలుపునివ్వడం, రాజకీయ ఘర్షణలకు దారితీసే విధంగా వ్యవహరించడం సరికాదని బీజేపీ జిల్లా వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ గంగాసాగర్ అన్నారు. రాజకీయ పోరాటాల పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించకూడదని ఆయన సూచించారు.బుధవారం మెట్‌పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గంగాసాగర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమయంలో రాజకీయ విమర్శలు, పరస్పర ఆరోపణల కంటే రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.కోరుట్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం యంత్రాలు, హమాలీలను అందుబాటులో ఉంచాలని, రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించాలని కోరారు.అదేవిధంగా కోరుట్లలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సదుపాయాలు కల్పించాలని, నియోజకవర్గంలో సాగునీరు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా పరస్పర రాజకీయ విమర్శలు, ఘర్షణలకు దిగడం వల్ల ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు రాజకీయ విమర్శలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాజకీయ పోరాటాలు చేయడం వల్ల వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. రాజకీయ నాయకులు వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ గంగాసాగర్ కోరారు.ఈ సమావేశంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జుంగుల అనిల్ గౌడ్, కలికోట శ్రీకాంత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, బీజేపీ జిల్లా కార్యదర్శి సుధావేణి మహేష్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు సుంకే అశోక్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కల్లెల రాజిరెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సంకు ప్రసాద్, తిరుసుల్లా అర్జున్, తోకల సత్యనారాయణ, తల్లోజు భాస్కర్, సంబోజి శ్రీధర్ ఆచారి, గుండు మోహన్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి భీమ్నాథ్ విజయ్, బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు అనసూయ చారి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మక ఐఎస్‌బిలో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి

సిరిసిల్ల వైద్యుడు డాక్టర్ సాయికుమార్

పభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ప్రధానం



సిరిసిల్ల టౌన్ నవంబర్ 18 (జనం సాక్షి) రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు, నియోనాటాలజిస్ట్, సరయు హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ తడుక సాయికుమార్ ప్రతిష్ఠాత్మక ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐ ఎస్ బి) నిర్వహించిన అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ హెల్త్‌కేర్ (ఎఎంపిహెచ్) విజయవంతంగా పూర్తి చేశారు. భారతదేశంలో అగ్రగామి బిజినెస్ స్కూల్‌గా, అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు పొందిన ఐ ఎస్ బి, ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్ 2026 లో ప్రపంచవ్యాప్తంగా 12వ స్థానం, భారతదేశంలో మొదటి స్థానం, ఆసియాలో రెండో స్థానం సాధించడం విశేషం. ఆరోగ్య రంగంలో నాయకత్వ లక్షణాలు, ఆసుపత్రుల నిర్వహణ, ఆర్థిక ప్రణాళిక, వ్యూహాత్మక నిర్ణయాలు, వైద్య సేవల నాణ్యత, ఆధునిక హెల్త్‌కేర్ విధానాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, హెల్త్‌కేర్ రంగ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 నవంబర్ 14న మొహాలీలోని ఎస్ఐబి క్యాంపస్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికు మార్‌కు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ప్రధానం చేశారు. వైద్య వృత్తిలో నిరంతర అభ్యాసంతో పాటు ఆధునిక హాస్పిటల్ మేనేజ్‌మెంట్, సాంకేతిక పరిజ్ఞానం, నూతన నిర్వహణ పద్ధతులను అనుసంధానం చేసి సిరిసిల్ల ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కోర్సును పూర్తి చేసినట్లు డాక్టర్ సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, కుటుంబ సభ్యులు, మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆటో ఛార్జీల పెంపు.. ప్రయాణికులు సహకరించాలి



లోకల్ కిరాయి రూ.60, రన్నింగ్ ఆటో ఛార్జీ రూ.30గా నిర్ణయం

కరీంనగర్ టౌన్, నవంబర్ 17, (జనం సాక్షి) పెరు గుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తు వుల ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులతో ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ ఆటో కార్మికుల సంఘం నాయకులు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలను గుర్తించి ప్రయాణికులు సహకరించాలని కరీంనగర్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కరీంనగర్‌లో ఆటో డ్రైవర్లు, వివిధ ఆటో యూని యన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యద ర్శులు కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆటో ఛార్జీల పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. యూనియన్ తరపున లోకల్ కిరాయిని రూ.60గా, రన్నింగ్ ఆటో ఛార్జీని రూ.30గా నిర్ణయించినట్లు వెల్లడించారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఇంధన ధరలు, వాహనాల మరమ్మతులు, నిర్వహణ ఖర్చుల కారణంగా ఆటో నడపడమే జీవనాధారంగా ఉన్న కార్మికులు కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. ఆటో కార్మికుల కష్టాలను ప్రయాణికులు అర్థం చేసుకుని పెంచిన ఛార్జీల విషయంలో సహకరించాలని కోరారు. వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ ఆటో కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోటుక ఐలేష్, ప్రధాన కార్యదర్శి సర్దార్ హరి చరణ్ సింగ్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ

ప్రతి కుటుంబానికి 5 లక్షల బీమా - ఎంపీడీవో సాధినేని ప్రియాంక



కమాన్ పూర్ , నవంబర్ 18, (జనంసాక్షి) : రాష్ట్రం లోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతుందని కమాన్ పూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాధినేని ప్రియాంక తెలిపారు. ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా కల్పించడమే ఈ పథక ప్రధాన లక్ష్యమని, కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించినప్పుడు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడమే ఉద్దేశమని తెలిపారు. కుటుంబాన్ని పోషించే 18–59 ఏళ్ల వయస్సు గల సభ్యుడు బీమా పొందే వ్యక్తిగా ప్రతిపాదించబడతారని, వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డు ప్రతిని ప్రాథమికంగా తీసుకుంటారని తెలిపారు.ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న పథకాన్ని ప్రారంభించి, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరి స్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు ఆధార్, రేషన్ కార్డు, కుటుంబ సభ్యులు వచ్చి నామిని వివరాలు ధ్రువీకరించాలని, రేషన్ కార్డు లేని వారు ఆధార్ ఓటీపీ తో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయమే కోతుల ఆవాసం



ఆర్మూర్,నవంబర్ 18(జనంసాక్షి): పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం వానరాలకు సురక్షిత ఆవాసంగా మారింది.మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కోతుల గుంపులు తిష్ట వేయడం స్థానికులను ముక్కున వేలేసుకునేలా చేసింది.మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో కోతుల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు వాపోతున్నారు.తాజాగా కోతుల గుంపులు ఏకంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చెత్త నిండిన ట్రాక్టర్ వాహనంపై గుమిగూడి హల్‌చల్ చేస్తున్నాయి.వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు,సిబ్బంది కోతుల భయంతో బిక్కుబిక్కుమంటూ లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని పలువురు భావిస్తున్నారు.

దీక్షా దివస్ బహిరంగ సభను విజయవంతం చేయండి

కొండూరి తోట ఆగయ్య



గంభీరావుపేట, నవంబర్ 18 (జనం సాక్షి):ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూర్ చౌరస్తాలో నిర్వహించనున్న దీక్షా దివస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు.గంభీరావుపేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు .2009 నవంబర్ 29న తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. ఆ దీక్షతోనే తెలంగాణ ఉద్యమం రాష్ట్రవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయంతో పాటు పలు రంగాలు దెబ్బతిన్నాయని విమర్శించారు.ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దీక్షా దివస్ సభను వేదికగా చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. డప్పు చాటింపు, కరపత్రాల పంపిణీతో సభపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గౌరీనేని నారాయణరావు, గంధ్యాడపు రాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్, అంజిరెడ్డి, పెద్దవేని వెంకట్ యాదవ్, లింగం యాదవ్, కమ్మరి రాజారాం, సుతారి సంపూర్ణ, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి..సంక్షేమ పథకాలు విజయవంతంగాఅమలు చేస్తున్నాం

పెద్ద పీట వేయడం జరుగుతున్నదని అన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో పని చేస్తున్నామని అన్నారు. పేద వాళ్ళను వెదికి వెదికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రాయితీ గ్యాస్ సిలిండర్ అమలవుతుండగా త్వరలోనే నెల నెలా ఆర్థిక సహాయం కూడా అందజేస్తామని అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19వ తేదీన కొత్త పింఛన్ డబ్బులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాబోతున్న నేపథ్యంలో మధ్య దళారీ లను నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని అన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లాలని అన్నారు.

నవంబర్ 19 న మరో కొత్త పథకం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమల్లోకి రాబోతున్నదని అన్నారు. ఆదార్ , నామినీ వివరాలు వెంటనే నమోదు చేసుకోవాలని అన్నారు. సంపాదించే వ్యక్తి మరణిస్తే ఈ పథకం కింద ఆ కుటుంబా నికి రూ 5.00 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యని అడ్డుగా ఉన్న పైలాన్ ను వేరే చోటకు తరలించే ప్రయత్నం చేస్తే రాద్దాంతం చేస్తున్నారని అన్నారు. నగరంలో విలువైన చాలా స్థలాలను ఆక్రమణల నుండి కాపాడి ప్రభుత్వానికి అప్పగించామని అన్నారు. డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలిస్తే రూ 40.00 కోట్లు వెచ్చించి అవసరమైన వసతులు కల్పించి ఉపయోగం లోకి తీసుకువచ్చి లబ్దిదారులకు అప్పగించామని అన్నారు. ఒకప్పుడు లక్షల మంది కి అన్ననీ పెట్టిన ఊరు ఉపాధి కరువై వెల వెల బోతుందని ముఖ్యమంత్రి , ఉప ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళితే మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో వందల కోట్ల రూపాయల నిధులు , వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్ట్ లు వస్తున్నాయని అన్నారు. వెనుక బడి ఉన్న రామగుండం లో ఉండలేక వలస పోదామనుకున్న వాళ్ళు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి చూసి ఇక్కడే స్థిర పడి పోదామని నిర్ణయించుకు న్నారని అన్నారు.

రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండం నగరంలో ప్రతి రెండో ఇంటిలో ఫించను లబ్దిదారు ఉన్నారని అన్నారు. మొత్తం 52 వేల ఇండ్లు ఉంటే కొత్తగా మంజూరైన వాటితో కలిపితే 22 వేల 700 ఫించన్లు ఉన్నాయని అన్నారు. ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు తన హయాంలో ఫించను మంజూరు కావడం సంతోషంగా ఉందని అన్నారు. ముప్పది ఏళ్ల క్రితం పెద్ద పట్టణం గా ఉన్న రామగుండం క్రమ క్రమంగా వెనుక బడి పోతే నాడు చిన్న పట్టణాలుగా ఉన్న సిద్ది పేట , మంచిర్యాల , కరీం నగర్ అభివృద్ధి చెంది పెద్ద నగరాలుగా అవతరించాయని అన్నారు .గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా వెనుకబడిన రామగుండం ను గత మూడేళ్లుగా ఎంఎల్ఎ రాజ్ ఠాకూర్ నవ నిర్మాణం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఒక ముఖ్య నగరంగా తీర్చి దిద్దే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ ప్రయత్నానికి మనమంతా అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. అలాగే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవడానికి వీలుగా అన్ని డివిజన్ లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతున్న దని అన్నారు.

ఎలాంటి ప్రీమియం వసూలు చేయకుండా అమలు చేస్తున్న ఇలాంటి బీమా పథకం దేశంలో మరెక్కడా లేదని అన్నారు.అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిష నర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ చేయూత ఫించను కొరకు సమర్పించిన ధరఖాస్తులను ఆన్ లైన్ వెరిఫికేషన్ తో పాటు క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన అనంతరం అర్హులైన 3111 మందిని ఎంపిక చేసి మంజూరు పత్రాలు ఇవ్వడం జరుగుతున్నదని అన్నారు. ఇంది రమ్మ కుటుంబ జీవిత బీమా ధరఖాస్తుల స్వీకరణ కొరకు డివిజన్ వారీ కౌంటర్ లు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య తో పాటు కార్పొరేటర్లు , తహశీల్దార్ రవీందర్ , నగర పాలక సంస్థ అధికారులు , పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంపై

అవగాహన సదస్సుకు సర్పంచుల గైర్హాజరు!

13 గ్రామాలకు నలుగురు సర్పంచులే హాజరు.. ప్రజలకు పథకంపై అవగాహన కల్పించేదెవరు?

ఉమ్మడి మేడిపల్లి (జనంసాక్షి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కుటుంబ ఇందిరమ్మ బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం భీమారం మండల కేంద్రంలో ఎమ్మార్వో, ఎంపీడీవో ఆధ్వర్యంలో అవగాహన సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆహ్వానించి పథకానికి సంబంధించిన వివరాలు, అమలు విధానం, ప్రజలకు అవగాహన కల్పించా ల్సిన బాధ్యతలపై వివరించారు.

అయితే భీమారం మండలంలో మొత్తం 13 గ్రామాలు ఉండగా, సమావేశానికి కేవలం నలుగురు సర్పంచులు మాత్రమే హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న కీలకమైన బీమా పథకంపై అవగాహన సమావేశానికి ప్రజాప్రతినిధులు తక్కువ సంఖ్యలో హాజరు కావడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

ప్రభుత్వ పథకాల గురించి గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులపై ఉంటుంది. ముఖ్యంగా కుటుంబ ఇందిరమ్మ బీమా వంటి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలంటే గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం, అవగాహన అవసరం. ఇలాంటి ముఖ్యమైన సమావేశాలకు ప్రజాప్రతినిధులు హాజరు కాకపోతే పథకం వివరాలు ప్రజలకు ఎలా చేరుతాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలపై నిర్వహించే సమావేశాలకు సర్పంచులు, సంబంధిత అధికారులు బాధ్యతగా హాజరై, పథకం వివరాలను గ్రామ ప్రజలకు చేరవేయాలని స్థానికులు కోరుతున్నారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా అవగాహన లేకుండా పథక ప్రయోజనాలకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

మిర్చి కంపౌండ్ లో పాఠశాల ఆకస్మిక తనిఖీ

నగరంలోని మిర్చి కంపౌండ్ లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన చేస్తుండగా పరిశీలించారు. అయితే మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా నాణ్యత ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

గొర్రెలకు ఉచిత అమ్మ వారి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం



కథలాపూర్ నవంబర్ 18 (జనంసాక్షి) కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు ఉచితంగా అమ్మవారి టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మదాం రవీందర్, ఉప సర్పంచ్ మల్లయ్య, పశువైద్యాధికారి డాక్టర్ హిమజ, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రాజ్ కుమార్, జమున, సిబ్బంది రసూల్ మరియు గ్రామంలోని గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది గొర్రెలకు వ్యాధుల నివారణ కోసం టీకాలు వేయడం జరిగింది. గొర్రెల పెంపకందారులు ఇలాంటి ప్రభుత్వ ఉచిత పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గొర్రెల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణతో పాటు పశుసంపద అభివృద్ధికి పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడండి



కథలాపూర్ నవంబర్ 18 (జనంసాక్షి) అల్లాపూర్ మండలంలోని గంభీర్పూర్ మరియు దుంపేట గ్రామంలో బుధవారం రోజున వరి కొయ్యకళ్ళు కాల్చడం వల్ల జరిగే అనర్థాలగురించి క్షేత్రస్థాయి లో రైతులకు మండల వ్యవసాయ అధికారి అవగాహన కల్పించారు. ఇదివరకు జరిగిన అనర్థాలు, ప్రాణహాని, నేల ఆరోగ్యం కు జరిగే హాని రైతులకు అర్థం అయ్యే విధంగా తెలిపారు. వరి కొయ్యకళ్ళు కాల్చిన రైతులకు జీఓ 27 అనుసరంగా జరిమానా విధించారు. ఇక పైన వరి కొయ్యకళ్ళు కాల్చవద్దని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారియోగీత తో పాటు ఏ ఇ ఓ లు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా కేసులో ముగ్గురు పట్టివేత

ఇద్దరు బాలలు, ఒకరిని కోర్టుకు తరలింపు..



గంభీరావుపేట, నవంబర్ 18 (జనం సాక్షి): అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న పోలీసులపై పికప్ వాహనంతో హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ ఆకుల రమేష్ గాయపడిన విషయం తెలిసిందే.ఈ నెల 18న తెల్లవారుజామున లింగన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో బ్లూకోట్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు మహిపాల్ అక్రమ ఇసుక పికప్ వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో డ్రైవర్ పోలీసులపైకి వాహనాన్ని దూసుకెళ్లడంతో రమేష్‌కు కుడి చేయి, కాలికి గాయాలయ్యాయి. ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.హోంగార్డు మహిపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం జగదాంబతండాలోని పెద్దమ్మ స్టేజ్ వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

వారి నుంచి నేరానికి ఉపయోగించిన పికప్ వాహనం, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరు మైనర్లు కావడంతో జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచి బాలల సంరక్షణ గృహానికి తరలించారు. మరో నిందితుడు వేముల విజయ్‌ను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై బాలరాజు వెల్లడించారు.



ఢిల్లీలో అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న జేరుపోతుల శ్రీనివాస్..

చిగురుమామిడి నవంబర్ 18(జనం సాక్షి):

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన జేరి పోతుల శ్రీనివాస్ ఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకోవడం జరిగింది. ఢిల్లీలో జరిగిన ఈ అవార్డు ఫంక్షన్ కారోల్ బాగ్ లో బహుజన సాహిత్య అకాడమీ 20వ సదస్సు సందర్భంగా శ్రీనివాస్ ను బహుజన సాహిత్య అకాడమీ వారు ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేశారు.శ్రీనివాసుకు ఈ అవార్డు రావడం పట్ల మండలంలోని పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.ఉల్లంపల్లి గ్రామంలో స్నేహితులు మిత్రులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

గంగపుత్ర సంఘం భవన నిర్మాణ పనులను ప్రారంభించిన మేడపాటి ప్రకాష్ రెడ్డి



ఎడపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి) :

ఎడపల్లి మండలం పోచారం గ్రామంలో ఎంపీ అరవింద్ ధర్మపురి కేటాయించిన మూడు లక్షల నిధులతో చేపట్టనున్న గంగపుత్ర సంఘం భవన నిర్మాణ పనులను గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి పాల్గొన్ని భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో గంగపుత్ర సంఘ భవన నిర్మాణం సామాజిక ఐక్యతకు, సంఘ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోచారం సర్పంచ్ నీరడి జ్యోతి రవికుమార్, ఉపసర్పంచ్ జక్కు పూజిత, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జక్కు రాజేందర్, కోశాధికారి సుదర్శన్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఎల్ఐసి గంగాధర్, కార్యదర్శి సాయిలు, ప్రతినిధులు చిన్న భూమయ్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, బీజేపీ జేపీ జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రామచందర్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్రీధర్, ఎడపల్లి మండల అధ్యక్షులు కోల ఇంద్రకరణ్, బోధన్ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపి కిషన్, రెంజల్ మండల అధ్యక్షులు యోగేష్, వివిధ గ్రామాల సర్పంచులు హనుమంతు, గెంట శ్రీనివాస్, అజయ్, జానకంపేట ఉపసర్పంచ్ కృష్ణ, ఎడపల్లి మండల బీజేపీ నాయకులు కమలాకర్, కిరణ్, ప్రవీణ్, గుండా శీను, రాము, మురళి, వెంకటేష్, పోచారం గ్రామ బీజేపీ నాయకులు భూమేష్, రంజిత్, సుధాకర్, కట్ట సాయి అలాగే గ్రామ పెద్దలు, గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయంలో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ఐదో రోజు నాలుగు హౌస్‌ల మధ్య ఆసక్తికరంగా క్విజ్ పోటీలు

జనంసాక్షి నిజాంసాగర్

జవహర్ నవోదయ విద్యాలయం, కామారెడ్డిలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు సాధారణ జ్ఞానం, మేధో సామర్థ్యాన్ని వెలికితీసే లక్ష్యంతో ఆసక్తికరమైన క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన నాలుగు హౌస్‌లు నీలగిరి, ఉదయగిరి, శివాలిక్, అరవల్లి హౌస్‌ల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చురుకుగా సమాధానాలు ఇస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలు విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని ప్రోత్సహించాయి.ఈ కార్యక్రమాన్ని పాఠశాల గ్రంథాలయాధికారి ఆకుల సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్. రాంబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠన అలవాటును పెంపొందిస్తూ, విజ్ఞానాన్ని విస్తరించేందుకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు దోహదపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాల నిర్మాణం కోసం విరాళం అందజేత



లింగంపేట్ నవంబర్ 18(జనంసాక్షి)

మండల కేంద్రంలో గల శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల నూతన భవన నిర్మాణనీ కొరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మర్రి రామ్ రెడ్డి లక్ష రూపాయల విరాళం చెక్కు రూపంలో అందజేయడం జరిగింది.

ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతి విద్యాపీఠలు సాంస్కృతిక మరియు సాంప్రదాయమైనటువంటి విద్యను సమాజం పట్ల విలువలతో కూడుకున్న విద్యను అందించడంలో శ్రీ సరస్వతి శిశు మందిరాలు అందిస్తున్నాయని శిశు మందిరాలు భావి భారత పౌరుల జీవితాలను తీర్చిదిద్దే పట్టు కొమ్మల వంటివన్నీ విద్యార్థుల జీవితాన్ని చిన్ననాటి నుంచి పెద్దలపట్ల గౌరవాన్ని సమాజం పట్ల విలువలతో కూడుకున్నటువంటి విద్యను నేర్పుతారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా ఇంచార్జ్ మర్రి బాపురెడ్డి, లింగంపేట మండల అధ్యక్షులు బొల్లారం క్రాంతికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కాని దత్తు రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్ల రామచందర్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అంద్యాల ఉదయ్, పట్టణ అధ్యక్షులు నరేష్ భగవాన్, బూత్ అధ్యక్షులు బొల్లు గణేష్, రామకృష్ణ, శిశు మందిర్ అధ్యాపక బృందం, పాఠశాల ప్రబంధకారిని బృందం పాల్గొన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జంగంపల్లి పాఠశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18(జనంసాక్షి)

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కామారెడ్డి పోలీస్ కళాబృందం సభ్యులు సూచించారు. బిక్కనూర్ మండలం జంగంపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆటపాటలు, కళారూపాల ద్వారా ప్రేమ పేరుతో జరిగే మోసాలు, మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, బాలలపై నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, అపరిచితులను నమ్మి మోసపోవద్దని సూచించారు. మూఢనమ్మకాలను విడనాడి, ప్రతి విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని తెలిపారు.





కేటీఆర్ భావిస్తున్న సిరిసిల్ల కంచుకోట కాదు.. మంచు కోట..

గడ్డం పెంచుకొని యాత్ర చేస్తే ప్రజలు నమ్మరు..

గత పాలనలో దోపిడీకి సమాధానం చెప్పాలి.. కేకే

గంభీరావుపేట, నవంబర్ 18 (జనంసాక్షి):

కేటీఆర్ భావిస్తున్న సిరిసిల్ల కంచుకోట కాదని, మంచుకోటగా మారిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం గంభీరావుపేట మండలం కొత్తపల్లి, కొళ్లమద్ది, లింగన్నపేట గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం విలేకరులతో మాట్లాడారు.

కేటీఆర్ హయాంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, తొమ్మిది వేల ఎకరాల భూమిని అనుచరులకు అప్పగించారని ఆరోపించారు. గడ్డం పెంచుకొని ఎలాంటి యాత్ర చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, యాత్రలో ప్రజలకు గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాలని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రుణాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభలో కేటీఆర్ బాగోతాన్ని బయటపెట్టారని పేర్కొన్నారు. రేపు సిద్దిపేటలో జరిగే సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హమీద్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటి, పర్శ హన్మాండ్లు, మేడ భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంటల మార్పిడిపై రైతులు దృష్టి సారించాలి

ఆరుతడి పంటలు, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

ఏఈఓ రవికుమార్

కల్యాణిపేట్‌లో ఖేత్ బచావో అభియాన్‌పై రైతులకు అవగాహన



సదాశివనగర్, నవంబర్ 18 (జనంసాక్షి):

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో పెట్టుకొని రైతులు ముందస్తుగా పంటల మార్పిడిపై దృష్టి సారించాలని ఏఈఓ రవికుమార్ సూచించారు. మంగళవారం కల్యాణిపేట్ గ్రామంలో రైతులకు ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పంటల సాగు, పంటల మార్పిడి, ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. యాసంగి, రానున్న వానాకాలం సీజన్లలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. వరి వంటి నీటి వినియోగం అధికంగా ఉండే పంటలకు ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పామ్, నూనెగింజలు, పప్పుదినుసుల సాగును ప్రోత్సహించాలన్నారు. సూర్యపువ్వు, నువ్వులు, జొన్న, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బిజెపి ఆధ్వర్యంలో నిరసన వినతిపత్రం

మల్యాల నవంబర్ 18 (జనం సాక్షి)

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని,రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి ఎమ్మార్వో శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు.మండల అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ కోతలు పూర్తయి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ముందస్తు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు,తూకం యంత్రాలు,ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితిని నివారించాలని కోరారు.రైతుల సంక్షేమమే దేశ సంక్షేమమని,రైతుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు పొన్నం సాయికుమార్,పిల్లి రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేష్,బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి గౌతం,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బొమ్మ పరమేష్, నులుగొండ సురేష్, పంబాల గంగాధర్,సంఘ శంకర్,షేర్ల పరశురాం, వేణు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





పిల్లల పుట్టినరోజులు.. సేవా కార్యక్రమాలతో ఆదర్శం..!

- కుమార్తె సహన్వి జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో రగ్గులు, భోజనం పంపిణీ

మంథని, నవంబర్ 18 (జనంసాక్షి) :

పిల్లల పుట్టినరోజులను ఆడంబరాలకు దూరంగా, సేవా కార్యక్రమాలతో జరుపుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు విజయ కుమార స్వామి. తన కుమార్తె తాటి సహన్వి పుట్టినరోజు సందర్భంగా బుధవారం గోదావరిఖనిలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆశ్రమంలోని వారికి రగ్గులు పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. గత రెండు నెలల క్రితం తన కుమారుడు తాటి సాయి వర్ధన్ పుట్టినరోజు సందర్భంగా ఐదు నిరుపేద కుటుంబాలకు తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.

మంథని సర్కిల్ కార్యాలయంలో రైటర్ గా విధులు నిర్వహిస్తున్న విజయ కుమార స్వామి, ఇటీవల సామాజిక అంశాలపై లఘు చిత్రాలు రూపొందిస్తూ యువతలో చైతన్యం కలిగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా మంచి సందేశాలు అందించడమే కాకుండా, ఆచరణలోనూ సామాజిక బాధ్యతను చూపుతూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

పిల్లల పుట్టినరోజులను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజంలో మానవత్వం, సహాయం చేసే గుణం పెంపొందించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.





ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సన్నాహాలు

అర్హులైన కుటుంబాలందరికీ బీమా నమోదు చేయాలి: మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి):

తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఎఐఏఖ) ప్రారంభానికి సంబంధించి నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఏ. పురుషోత్తం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పథకం అమలుకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలను గుర్తించి, బీమాకు అర్హత కలిగిన సంపాదించే సభ్యుల వివరాలను సేకరించాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ నంబర్లు, నామినీ వివరాలను నమోదు చేయడంతో పాటు గ్రామపంచాయతీల వారీగా ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలన్నారు.నమోదు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, సిబ్బందికి బాధ్యతలు కేటాయించి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు ప్రత్యేక సహాయం అందించాలని, అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా నమోదు నుంచి మిగిలిపోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్ గౌడ్, ఎంఈఓ నాగనాథ్, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, క్లస్టర్ ప్రత్యేక అధికారులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ వీఓఏలు, ఇతర గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్

స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్ , బోధన్ రూరల్ సీఐ విజయబాబు , రిజర్వ్ ఇన్స్పెక్టర్ ధరణి , ఎం.టి.ఓ శేఖర్ బాబు , ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వినోద్ , ఎస్సైలు , ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ చేసిన డాక్టర్ బి.ఎన్.రావు ఫౌండేషన్

ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బండారి నరేందర్ రావు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి) :

ఎస్సీ స్టడీ సర్కిల్ లో 5 నెలల ఉచిత కోచింగ్ పొందుతున్న వంద మంది విద్యార్థులకు రాబోయే ఉద్యోగ నియామక పరీక్షలకు ఎన్. సురేష్ రాసిన తెలంగాణ చరిత్ర, సంస్కృతి అనే పుస్తకాన్ని డాక్టర్ బండారి నరేందర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.ఎన్.రావు, ట్రెజరర్ ఎం.డి. అలీమ్, ప్రముఖ నాయకులు, అడ్వకేట్ నిషాని రామచంద్రం, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ విశేషాలను విద్యార్థులు తెలుసుకోవడానికి ఇటువంటి పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించడంతో పాటు తెలంగాణ చరిత్రను భావితరాలకు పరిచయం చేసే ఉద్దేశంతో ఫౌండేషన్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నివారించాలి: భాజపా

బోయిన్‌పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

బోయిన్‌పల్లి, నవంబర్ 18 (జనం సాక్షి)

మండల వ్యాప్తంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని భాజపా బోయిన్‌పల్లి మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ డిమాండ్ చేశారు. కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, పార్టీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జువ్వింతుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు పండించిన ప్రతి గింజనూ ఎటువంటి నిబంధనలు, షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. తేమ శాతం పేరిట కొనుగోళ్లను నిలిపివేయడం, తరుగు పేరుతో కోతలు విధించడం సరికాదన్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని, దీనివల్ల దళారుల దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారదర్శకంగా కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహా చారి, మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, స్వామి కుమార్, సారంపల్లి రాజు, గంగాధర్ చారి, శేఖర్, ప్రశాంత్, నాగరాజు, అనిల్, చంద్రయ్య, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



- ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందున యుఆర్టిపి రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు

ఆర్మూర్,నవంబర్ 18(జనంసాక్షి):

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతు ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా అవుతానని ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి కూరపాటి అరుణ జ్యోతి అన్నారు. ఆర్మూర్ మండలంలోని చేపూరు హరిపూర్ గ్రామ శివారులో రుక్మారెడ్డి ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. ఆర్మూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ ప్రకటించినందున పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఎలాంటి కుల మతభేదం లేకుండా ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు ముందుంటానన్నారు. బీసీ మహిళా బిడ్డగా రాజకీయాల్లోకి వస్తున్నందున ప్రజలు ఆశీర్వదించాలన్నారు. నియోజకవర్గంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని నిలదీశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అన్ని సమకాలీన అంశాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కొందరి రాజకీయ నాయకులకు ఎలక్షన్లు వస్తాయ ప్రజలు గుర్తుకు వస్తారని దుయ్యబట్టారు.వైద్యం,విద్య,రైతులకు మహిళా శక్తిగా అండగా నిలబడి ఉంటానన్నారు. నియోజకవర్గం లో జరిగిన డబుల్ బెడ్ రూమ్ లక్కీ డ్రా పంపిణీలో పేదలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీ మహిళా బిడ్డగా నియోజకవర్గంలో అన్యాయం జరిగినచోట ఉండి ప్రజల పక్షాన ప్రశ్నించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అశోక్, మహిళా నాయకులు సుశీల,స్నేహ,వనజ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తా..



యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సూచన మేరకే వాడాలి

◆ఏఎంఆర్‌పై అవగాహనతోనే ఆరోగ్య పరిరక్షణ ◆ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కామారెడ్డి, జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనంసాక్షి)

ప్రపంచ యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అవగాహన వారోత్సవాల సందర్భంగా కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ ప్రపంచ ప్రజారోగ్యానికి పెను సవాలుగా మారుతోందన్నారు. యాంటీబయాటిక్స్‌తో పాటు ఇతర యాంటీమైక్రోబయల్ మందులను వైద్యుల సూచన మేరకే వినియోగించాలని సూచించారు. వైద్యుల సలహా లేకుండా మందులు వాడటం, అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల సూక్ష్మజీవుల్లో మందులను తట్టుకునే నిరోధకత పెరుగుతుందని తెలిపారు. ఇతరులకు



సూచించిన మందులను వాడకూడదని, వైద్యులు సూచించిన చికిత్సను మధ్యలో నిలిపివేయకూడదని పేర్కొన్నారు.ఏఎంఆర్ ప్రభావం మానవ ఆరోగ్యానికే కాకుండా జంతువులు, వ్యవసాయం, పర్యావరణం పైనా ఉంటుందని, దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనంతరం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు 'వన్ హెల్త్ – వన్ యాక్షన్: ప్రివెంట్ ఏఎంఆర్ నౌ' నినాదాలతో ఆసుపత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ, హెచ్ఓడీ డాక్టర్ భవాని, ఇన్ఫెక్షన్ కంట్రోల్ సిబ్బంది, వైద్యులు, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టేక్రియాల్‌లో రైతులకు వ్యవసాయంపై అవగాహన

శాస్త్రీయ సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18(జనంసాక్షి)

కామారెడ్డి మండలం టేక్రియాల్ గ్రామంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమంతో పాటు ఖేత్ బచావో అభియాన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులు, పంటల సంరక్షణ, సమగ్ర పంట యాజమాన్యం, శాస్త్రీయ సాగు విధానాలపై అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పంటల దిగుబడులు పెంచుకోవడంతో పాటు చీడపీడల నివారణకు శాస్త్రీయ పద్ధతులు పాటించాలని సూచించారు. సాగులో ఆధునిక మెళకువలను అవలంబిస్తూ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డీపీడీ (ఆత్మ) మహిత, వ్యవసాయ శాస్త్రవేత్త రేవంత్, ఏడీఏ అపర్ణ, ఏఓ పవన్ కుమార్, ఏఈఓలు దేవేంద్ర, శ్రీనివాస్ రెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ లలిత చిట్టిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేష్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



భిక్కనూరు పి.హెచ్.సిలో కంటి పరీక్షల శిబిరం

కేటరాక్ట్ బాధితులకు ఉచిత ఐఓఎల్ శాస్త్రచికిత్స

భిక్కనూరు నవంబర్ 18 (జనంసాక్షి):

భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి పరీక్షల శిబిరాన్ని దోమకొండ డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రవీందర్ పాటిల్ నిర్వహించారు. ఈశిబిరంలో భాగంగా కంటి శుక్లనీ,దృష్టిలోపం సమస్యతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలు చేసి బాధితులను గుర్తించారు. తదుపరి ఈశిబిరంలో కంటి శుక్లనీ ఉన్న రోగులకు మెరుగైన చికిత్స నిమిత్తం బోధన్ లోని లయన్స్ ఐ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ వారికి ఉచితంగా కంటిలో కృత్రిమ లెన్స్ అమర్చడంతో శాస్త్రచికిత్స నిర్వహించనున్నారు.అదేవిధంగా దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలను సిఫార్సు చేశారు. అనంతరం డాక్టర్ రవీందర్ పాటిల్ మాట్లాడుతూ కంటి దృష్టి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కంటి సమస్యలను నివారించవచ్చని ముఖ్యంగా ఆహారంలో పాలకూర, మునగాకు,గుడ్డు,చేపలు,అవిసె గింజలు,వాల్ నట్స్,చియా విత్తనాలు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ఆహారంతోపాటు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి ఆర్ వెంకటరమణ, సిబ్బంది సతీష్,వనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన సమావేశం

దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు విధానంపై సిబ్బందికి శిక్షణ

నిజాంసాగర్ (జనం సాక్షి):

నిజాంసాగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ పథకానికి సంబంధించి రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులను ఏ విధంగా స్వీకరించాలి, వాటిని ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలి అనే అంశాలపై సంబంధిత సిబ్బందికి వివరంగా శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు, ఐకేపీ వీవోఏలకు దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. పథకం అమలులో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకం ప్రయోజనాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో మండల రెవెన్యూ అధికారి సాయి భుజంగరావు, ఎంపీడీవో శివకృష్ణ, ఎంఈవో తిరుపతిరెడ్డి, ఐకేపీ ఏపీఎం ప్రసన్న రాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయాలి.. నూతన పీఆర్సీ ప్రకటించాలి

గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనం సాక్షి)



గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, ఎంజేపీ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. లివింగ్టన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం కామారెడ్డి బాలికల ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, ఉద్యోగులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో అమలవుతున్న టైమ్‌టేబుల్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులకు అనుకూలంగా మార్చాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు నూతన పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నూతనంగా నియామకమైన ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.ఉద్యోగుల హక్కుల సాధనకు సంఘటిత పోరాటం అవసరమని, ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ లో సభ్యులుగా చేరి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, రాష్ట్ర కార్యదర్శి జి. వెంకటనారాయణ, మురళి, కృష్ణయ్య, రూప్‌సింగ్, నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థులకు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కాంస్య పతకాలు

కరీంనగర్ కల్చరల్, నవంబర్ 18,(జనం సాక్షి):



మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ ఎస్.జి.ఎఫ్.ఐ. తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సి.హెచ్.భువన,9వ తరగతి విద్యార్థిని ఏ.మోక్షజ్ఞ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించారు.ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా॥ ఇ.ప్రసాదరావు,డైరెక్టర్లు ప్రసూన,అనూకర్ రావు,రశ్మిత, రాకేశ్,వి.యు.యం.ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె. హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ,సమన్వయకర్తలు నాగరాజు, రాము,రవీంద్ర పాత్రో,వ్యాయామ ఉపాధ్యాయులు అమరేందర్,రాజు,సాజన్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

పదవ తరగతిలో మెరిట్ విద్యార్థికి రూ. లక్ష రూపాయల చెక్కును అందించిన ఆర్డిఓ

బోధన్, నవంబర్ 18 (జనంసాక్షి) : బోధన్ మండలం కల్దుర్కి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని పదవతరగతి పరీక్షలలో మెరిట్ సాధించినందుకు గురువారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల చెక్కును బోధన్ ఆర్డీవో విజయ కుమారి చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నల నరేందర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బంటు గంగాధర్, సిరిగిరి అశోక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



25న నిర్వహించే గోదావరి మహా హారతిని విజయవంతం చేయండి

రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ పిలుపు



గోదావరిఖని, జనంసాక్షి :
గోదావరి హారతి ఉత్సవ సమితి సమావేశం మంగళవారం కళ్యాణ్ నగర్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బిజెపి నాయకులు ఖ్యాతం వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణలో గోదావరి హారతి కార్యక్రమాన్ని 2012 నుండి ప్రారంభించడం జరిగిందని అప్పటినుండి 15 సంవత్సరాలుగా నిర్విరామంగా కార్తీక మాసంలో నదీమ తల్లికి మహా హారతి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఈనెల 25వ తేదీన బుధవారం సాయంత్రం సమ్మక్క సారలమ్మల జాతర స్థలంలోని గోదావరి తీరంలో మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నదీమతల్లి ఆశీస్సులు పొందగలరని కోరుతున్నాం. పవిత్రమైన కార్తీక మాసం శివకేశవులకు ప్రీతిపాత్రమైన మాసమని ఈ మాసంలో నది దీపారాధన చేసిన యెడల ఆ కుటుంబం సకల సౌభాగ్యాలతో విలసిల్లుతుందని మన పూర్వీకులు మనకు నేర్పిన ఆచార సాంప్రదాయం హైందవ ధర్మంలో ఒక భాగంగా వస్తుందని దానిని కొనసాగించడమే గోదావరి హారతి ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ సమావేశంలో క్యాతం వెంకటరమణ, గోదావరి హారతి ఉత్సవ సమితి ప్రతినిధులు నలుమాస సత్తయ్య, తాటి పెల్లి వెంకన్న, గొడిసెల విజయ్, అంశాల వీరేశం,దుబాసి వీరలింగం,గాధర్ల లక్ష్మణ్ నగునూరి అంజలి, కాంత దేవి,పద్మ , కళావతి, రామయ్య, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో ఘనంగా సోషల్ మేళా

విద్యార్థుల సృజనాత్మకతకు, సామాజిక అవగాహనకు వేదికగా సోషల్ మేళా



మేడిపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి):
జగిత్యాల జిల్లా కట్లకుంట గ్రామంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు ఎ. వైకుంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ మేళా – 2027 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో 60 కి పైగా మోడల్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సామాజిక శాస్త్రంలోని చరిత్ర, భూగోళశాస్త్రం, పౌరశాస్త్రం, ఆర్థికశాస్త్రం వంటి వివిధ అంశాలపై ఆకర్షణీయమైన నమూనాలు, త్రీడీ మోడల్స్, చార్టులు, పోస్టర్లు మరియు పని చేసే నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ, అడవుల ప్రాముఖ్యత, ప్రకృతి వనరులు, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు మరియు గ్రామీణ అభివృద్ధి వంటి సమకాలీన అంశాలను తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. విద్యార్థులు స్వయంగా రూపొందించిన నమూనాలను సందర్శకులకు వివరిస్తూ తమలోని సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం మరియు విషయ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక అనుభవం కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని, సామాజిక బాధ్యతను, ప్రజాస్వామ్య విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. "నేర్చుకుందాం – ఆలోచిద్దాం – సృజిద్దాం – సమాజ అభివృద్ధికి తోడ్పడదాం" అనే సందేశంతో సోషల్ మేళా – 2027 ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హనుమాన్ సాగర్, ఉపాధ్యాయులు, శ్రీధర్, రమాదేవి,గోపికృష్ణ, రవీందర్, వైకుంఠం, సంతోష్, సాజిద్ రెహానా పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమికి అరుణాచలం ప్రత్యేక బస్సు యాత్ర

హుస్నాబాద్ డిపో నుంచి నాలుగు రోజుల టూర్ ప్యాకేజీ

కార్తీక పౌర్ణమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్ టీసి) హుస్నాబాద్ డిపో నుండి అరుణాచలం ప్రత్యేక టూర్ ప్యాకేజీ ..



చిగురుమామిడి/ హుస్నాబాద్ నవంబర్ 18(జనంసాక్షి):
కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. ఇటును భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ అన్నారు.

ప్రయాణ వివరాలు & టికెట్ ధరలు
ప్రారంభ స్థలం:హుస్నాబాద్ డిపో (సూపర్ లగ్జరీ బస్సు).
పెద్దలకు టికెట్ ధర: -4,500/-
పిల్లలకు టికెట్ ధర: -3,200/-
యాత్ర షెడ్యూల్ (4 రోజులు)
22-11-2026 (ఆదివారం): సాయంత్రం హుస్నాబాద్ డిపో నుండి బస్సు ప్రయాణం ప్రారంభమవుతుంది. 23-11-2026 (సోమవారం): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం మరియు వేలూరు గోల్డెన్ టెంపుల్ (శ్రీపురం) దర్శనం ఉంటుంది. దర్శనానంతరం అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుంది.
24-11-2026 (మంగళవారం – కార్తీక పౌర్ణమి):అరుణాచలేశ్వర స్వామి దేవాలయ దర్శనం (గిరి ప్రదక్షిణకు అవకాశం ఉంటుంది).
25-11-2026 (బుధవారం): ఉదయం అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం దర్శనం ఉంటుంది. దర్శనానంతరం తిరిగి బయలుదేరి అదే రోజు సాయంత్రం హుస్నాబాద్ వస్తుంది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ మరియు మరిన్ని వివరాల కోసం అధికారిక బుకింగ్ వెబ్‌సైట్ను సందర్శించండి. పూర్తి వివరాల కోసం.
9951990992 ను సంప్రదించండి.

ఇప్పపెల్లి గ్రామంకి 33/11 సబ్‌స్టేషన్ మంజూరు



కథలాపూర్ నవంబర్ 18 (జనం సాక్షి)
కథలాపూర్ మండలంలోని ఇప్ప పెల్లి గ్రామంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైనట్లు ట్రాన్స్కో ఎడి ఈ రఘుపతి బుధవారం తెలియజేశారు. లో వోల్టేజ్ సమస్యను తీర్చినందుకు కృతజ్ఞత గా ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి సాల్వ సన్మానం చేయడం జరిగింది. ఇప్పపెల్లి సర్పంచ్ సాంబ నవీన్, ఉపసర్పంచ్ సుజాత,రంజిత్ లు మరియు గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యే ప్రభుత్వ ఆది శ్రీనివాస్ కి ధన్యవాదములు తెలపడం జరిగినది.

సిద్ధార్థ పటేల్ జన్మదినం సందర్భంగా

'మిల్స్ ఆన్ వీల్స్' ఆధ్వర్యంలో అన్నదానం

కరీంనగర్ల, క్రైమ్ నవంబర్ 18 (జనంసాక్షి) :
లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మిల్స్ ఆన్ వీల్స్' ఆకలి నివారణ కార్యక్రమాన్ని స్థానిక మార్కెట్ వెంకటేశ్వర స్వామి దేవాలయం పక్కన విజయవంతంగా నిర్వహించారు. చిందం చిత్రరేఖ ? శ్రీనివాస్ దంపతుల కుమారుడు చిరంజీవి చిందం సిద్ధార్థ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేదలకు భోజనాలతో పాటు స్నేహితుల సహకారంతో అరటిపండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు, మిల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్ మైదం శివకాంత్ పటేల్ మాట్లాడుతూ.. జన్మదినాలను ఇలాంటి సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమ న్నారు. దాతలు, మిత్రుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఐత సూరజ్ కుమార్, రాపెల్లి రవీందర్ రావు, డా. తుంగూరి కార్తీక్, డా. అర్చన, రామ్?శ్యామ్, అభిషేక్, జగదీష్, ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్ పటేల్, పెద్ది విద్యాసాగర్, బొడ్ల రవీందర్, చిదుర సురేష్, కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొని సిద్ధార్థ పటేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత దంత వైద్య సేవలు

దంత ఆరోగ్య పరిరక్షణకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ముందడుగు

సేవలు అభినందనీయం: డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనం సాక్షి)
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల దంత ఆరోగ్య పరిరక్షణకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె. వెంకటి అన్నారు. విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధులను గుర్తించి అవసరమైన చికిత్స అందించేందుకు అసోసియేషన్ ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో దంత వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు నోటి పరిశుభ్రత, దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. దంత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను నివారించవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు సైతం ఉచిత దంత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా సేవలు అందించేందుకు ముందుకొచ్చిన అసోసియేషన్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం మెడలు వంచైనా రైతులకు సాగునీరు సాధిస్తాం!

డి-9 కాలువ వరకు లక్షన్నర ఎకరాలకు నీరు విడుదల చేయాలి : మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నిజాంసాగర్(జనంసాక్షి):

నిజాంసాగర్ ప్రాజెక్టు కింద సాగు చేసే రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, అవసరమైతే ప్రభుత్వం మెడలు వంచైనా డి-9 కాలువ వరకు సాగునీటిని విడుదల చేయిస్తామని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే స్పష్టం చేశారు. ప్రాజెక్టు కింద సుమారు లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన విమర్శించారు. బుధవారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టులో సుమారు 10 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతులు తుకాలు పోసుకునేందుకు కూడా సాగునీరు అందించకపోవడం బాధాకరమన్నారు. రైతుల అవసరాలను గుర్తించి వెంటనే డి-9 కాలువ వరకు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తాగునీటి అవసరాలకు సుమారు 2 టీఎంసీల నీరు సరిపోతుందని, మిగిలిన 8 టీఎంసీల నీటితో లక్షన్నర ఎకరాలకు సాగునీరు



అందించిన సందర్భాలు గతంలో ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో తక్కువ నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించినట్లు వివరించారు.

2013లో నిజాంసాగర్ ప్రాజెక్టులో కేవలం 3.888 టీఎంసీల నీటి నిల్వ ఉన్న సమయంలో 2.624 టీఎంసీల నీటిని విడుదల చేసి 55 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు గుర్తు చేశారు. అలాగే 2018లో 3.958 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నప్పటికీ 2.836 టీఎంసీల నీటిని డి-9 కాలువ వరకు విడుదల చేసి రైతులకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు.

గతంలో రైతులకు అవసరమైన సమయంలో సాగునీటిని విడుదల చేసి పంటల సాగుకు సహకరించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులు తుకాలు పోసుకునేందుకు వెంటనే డి-9 కాలువ వరకు సాగునీటిని విడుదల చేయాలని కోరారు.

ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహిస్తామని, సాగునీరు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దఫెదర్ రాజు, మాజీ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి

తంగళ్ళపల్లి మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన:అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

తంగళ్ళపల్లి, నవంబర్ -18, జనం సాక్షి.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల, అంకుసాపూర్ గ్రామాల్లో ఫ్యాక్స్, ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని, నిర్దేశించిన తేమ శాతం వచ్చిన తర్వాతే తూకం వేయాలని అన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.



భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన..

తంగళ్ళపల్లి మండలం వేణుగోపాలపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన భూముల రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికారుల బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్లు మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా తో పేదల కళ్ళల్లో ఆనందం

- నేడు ఆరవ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కౌన్సిలర్ బాకమ్ సాయికిరణ్ యాదవ్

సుల్తానాబాద్,నవంబర్ 18(జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో పేదల కళ్ళల్లో ఆనందం వెల్లి విరుస్తోందని, ఆరవ వార్డు కౌన్సిలర్ సామాజిక సేవకులు బాకం సాయికిరణ్ యాదవ్ స్పష్టం చేశారు. నేడు ఆరవ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు, కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ తెలిపారు. ఆరవ వార్డు ప్రజలందరూ ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని



సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన అట్టడుగు వర్గాల ప్రభుత్వమని, ప్రతి ఒక్కరూ జీవిత బీమా ఉచితంగా పొందాలన్న ఏకైక లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇట్టి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జీవిత బీమా పథకం కోసం నేడు ప్రతి ఒక్కరు లబ్ధి పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ప్రతి ఒక్కరు జీవిత బీమా పథకం దరఖాస్తు చేసుకోవాలని ఆరవ వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ సూచించారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి సంక్షేమమే మా లక్ష్యం అని తెలిపారు.



బీఆర్ఎస్ పార్టీలోకి దూప్‌సింగ్ తండా వార్డు సభ్యుడు

మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న మెగావత్ నరేష్

నిజాంసాగర్(జనంసాక్షి):

మహమ్మద్ నగర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు చోటుచేసుకున్నాయి. మండలంలోని దూప్‌సింగ్ తండాకు చెందిన ఎనిమిదో వార్డు సభ్యుడు మెగావత్ నరేష్ బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఉమ్మడి జిల్లాల మాజీ జెడ్పీ చైర్మన్ దాఫెదర్ రాజు, మహమ్మద్ నగర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, దూప్‌సింగ్ తండా సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగావత్ నరేష్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ విధానాలు, ప్రజల సంక్షేమం కోసం గతంలో చేపట్టిన కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు, ప్రస్తుత సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోర్ మోటార్ ను ప్రారంభించిన

బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

తంగళ్ళపల్లి నవంబర్ 18 జనంసాక్షి



తంగళ్ళపల్లి మండలం, పాపయ్య పల్లె గ్రామంలో ఎంపీ నిధుల నుండి మంజూరైన బోర్డర్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పాపయ్య పల్లె గ్రామంలో యాదవ సంఘం సభ్యుల అవసరాల నిమిత్తం బోరు మంజూరు చేయమని కోరారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా యాదవ సంఘం అవసరాన్ని గుర్తించి ఎంపీ నిధులనుండి రెండు లక్షల రూపాయలు మంజూరు చేసి, బోరు పనులను పూర్తి చేశారు. బుధవారం రోజున బోర్ మోటార్ ను ప్రారంభించారు. ప్రజా అవసరాలను, సమస్యలను గుర్తించి సంబంధిత బిజెపి నాయకుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేయడంలో బిజెపి నాయకులు ప్రజాసేవ నిబద్ధతకు నిదర్శంగా ఉంటారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు, కుల సంఘాల అభివృద్ధికి బండి సంజయ్ కుమార్ తన నిధుల ద్వారా సహకారం అందిస్తారని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ పరుశురాములు బిజెపి జిల్లా అధ్యక్షుడు గోపిని శాలువాతో సన్మానించారు. బోర్ మోటార్ కు సహకరించిన బండి సంజయ్ కుమార్ కు యాదవ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి పల్లె సర్పంచ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాబీర్, ఓబీసి మోర్చా ఉపాధ్యక్షుడు సంద వేణి రాజు, మండల ప్రధాన కార్యదర్శి కోస్ని వినయ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జంగం కిషన్, బజాజ్ తిరుపతి ఎల్లయ్య అనిల్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి

భిక్కనూరు నవంబర్ 18 (జనంసాక్షి):

భిక్కనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.వివరాల్లోకి వెళితే ఈనెల10న మంగళవారం సాయంత్రం సాయిలక్ష్మి తన కుమారుడు సాయిల రాజుతో కలిసి పెళ్లి పత్రికలు పంచి లింగుపల్లి గ్రామం నుండి తమ స్వగ్రామమైన వెంకటాపూర్ గ్రామానికి మోటార్ సైకిల్ పై తిరిగి వెళ్తుండగా,బిటిఎస్ సౌత్ క్యాంపస్ సమీపంలో అకస్మాత్తుగా పందిపిల్లలు రోడ్డుపై అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడింది.ఈప్రమాదంలో సాయిలక్ష్మికి తలకు తీవ్రగాయాలు కాగా ఆమె కుమారుడు రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆమెను కామారెడ్డిలోని న్యూరో ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం కొంపల్లిలోని మెడ్విన్ ఆసుపత్రికి,అక్కడి నుంచి ఈనెల 15న సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం సాయిలక్ష్మి మృతి చెందింది. ఈఘటనపై మృతురాలి సోదరుడు నందీష శ్రీశైలం భిక్కనూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై ఎస్ అనిల్ తెలిపారు.

భూ కొలతల ప్రక్రియను అత్యంత

పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలి

◆గర్రెపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, పతిపూర్‌లో భూమి సర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

◆ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

◆ నాణ్యమైన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని, సర్వే రికార్డులను పక్కాగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశం



సుల్తానాబాద్,నవంబర్ 18(జనంసాక్షి) :
సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, భూపతిపూర్ గ్రామంలో జరుగుతున్న భూమి సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

- గర్రెపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ :

ముందుగా గర్రెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన లిఅదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ,లి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కేంద్రంలో ధాన్యం నిల్వలు, తేమ శాతం కొలిచే యంత్రాలు, గన్నీ సంచుల లభ్యత మరియు తూకం ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, నిర్దేశించిన తేమ శాతం ఉండేలా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల ద్వారా మిల్లులకు తరలించాలని, రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా ట్యాబ్ ఎంట్రీలను త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

- భూపతిపూర్‌లో భూమి సర్వే పరిశీలన :

అనంతరం భూపతిపూర్ గ్రామంలో జరుగుతున్న భూమి సర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్, భూముల సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని రెవెన్యూ, సర్వే అధికారులకు సూచించారు. గ్రామంలోని సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణం,నక్షా (మ్యాపులు) మరియు రెవెన్యూ రికార్డులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భూ యజమానులు,రైతుల సమక్షంలోనే సరిహద్దులను నిర్ధారించి హద్దులు ఏర్పాటు చేయాలని,సర్వే ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరుద్దీన్, వ్యవసాయ శాఖ అధికారులు,మండల సర్వేయర్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ),కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

దళితఎంపీని అవమానపరచడం సరికాదు

- దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం సతీష్ కుమార్



సుల్తానాబాద్,నవంబర్ 18(జనంసాక్షి) :
నిరంతరం ప్రజా సమస్యలపై పార్లమెంటులో గలమెత్తుతూ పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ ని పెద్దపల్లి నియోజకవర్గంలోని కాల్వ శ్రీరాంపూర్ మండలంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ పేరుతో దళిత ఎంపీ ని అవమానించడం చాలా బాధాకరం దీనిని (దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం సతీష్ కుమార్ ఖండించారు.స్థానిక పెద్దపల్లి ఎమ్మెల్యే మండలంలోని కార్యక్రమాలలో బిజీగా ఉండడంవల్ల సకాలంలో హాజరు కాలేకపోయారు, అందువల్ల అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు పాటించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంపీ చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ చేస్తే బాగుండేది కానీ అధికారులు కలెక్టర్ కోసం చూస్తూ నిర్లక్ష్యాన్ని వహించారన్నారు. కొందరు వ్యక్తులు వాళ్ల స్వప్రయోజనం కోసం రాజకీయ గుర్తింపు కోసం సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఎంపీ ని అడ్డుకున్నామంటూ విష ప్రచారం చేయడం విచారకరం. ఇక ముందైనా ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులకు సరైన గౌరవం కల్పించడమే కాకుండా అధికారులందరూ ప్రోటోకాల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని డిమాండ్ చేస్తూ దళిత ఎంపీ ని అవమానించిన నాయకులందరికి విజ్ఞప్తి ఏంటంటే గత పది సంవత్సరాల బి.ఆర్. ఎస్ పాలనలో ఏ ఒక్క ఎంపీ చేయనటువంటి అభివృద్ధి కార్యక్రమాలను చేసి చూపించిన ఘనత మన పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ప్రజలందరూ వంశీకృష్ణ నాయకత్వాన్ని కోరుకొని ఆయనను భారీ మెజారిటీతో గెలిపించారని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ మరొక్కసారి దళిత ఎంపీ వంశీ కృష్ణ ని విమర్శించే ముందు మీకు మీరు ఆత్మ విమర్శ చేసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాము.

దివ్యాంగులకు రగ్గులు. (చెద్దర్లు)

- పంపిణీ చేసిన సామాజిక కార్యకర్తలు అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు



సుల్తానాబాద్,నవంబర్ 18(జనంసాక్షి) :
పట్టణంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో ఉన్న దివ్యాంగులకు సుల్తానాబాద్ పట్టణం గాంధీనగర్ కు చెందిన రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్తలు అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు 15 మంది దివ్యాంగులైన చిన్నారులకు చలికాలం చలి నుండి తట్టుకునే విధంగా ఉండటం కోసం రగ్గులు..(చెద్దర్లు) పంపిణీ చేశారు. యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్ ఇచ్చిన పిలుపుమేరకు సుల్తానాబాద్ పట్టణంలో చాలామంది రోడ్డు పక్కన, దివ్యాంగుల సెంటర్లో ఉన్నవారికి చలితో బాగా ఇబ్బంది పడటాన్ని గమనించి, ఎవరైనా పెద్ద మనసు చేసుకొని వీరికి,చలినుండి కాపాడే విధంగా చెద్దర్లు అందించాలని కోరగా, దానికి అనుగుణంగా సుల్తానాబాద్ పట్నానికి చెందిన అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు ముందుకు వచ్చి పెద్ద మనసు తో సెంటర్లో ఉన్న 15 మంది దివ్యాంగులకు చెద్దర్లు పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు.ఈ సందర్భంగా అల్లం సత్యనారాయణ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ,ఇలాంటి కార్యక్రమాలు చేయడం మాకు చాలా సంతోషంగా ఉందని ,మేము చెదర్లు పంచుతూ ఉంటే వాళ్ల ముఖంలో చిరునవ్వు చూశామని,ఆ నవ్వు మాకు చాలని వాళ్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్, సభ్యులు దేశెట్టి రమేష్.. ఏబీఎన్ కనకయ్య సెంటర్ ఇన్చార్జి శ్రీనివాస్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

- అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దపల్లి,నవంబర్ 18(జనంసాక్షి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా నిర్వహించనున్న ప్రత్యేక క్యాంపుల నిర్వహణ పై ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఐ కే జె బి పి) ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కుటుంబంలో సంపాదించే సభ్యునికి జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని పేర్కొన్నారు.నవంబర్ 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పథకం మార్గదర్శకాలు, అర్హతలు, నమోదు విధానం, అవసరమైన పత్రాలు, క్యాంపుల నిర్వహణపై సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.నవంబర్ 19న పథకం ప్రారంభమైన అనంతరం జిల్లాలోని ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి జనావాసం పరిధిలో క్యాంపు కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి జనావాసానికి క్యాంపు సౌకర్యం అందేలా అవసరమైన సంఖ్యలో బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జనావాసాల వారీగా క్యాంపుల షెడ్యూల్ రూపొందించాలని, క్యాంపుల నిర్వహణ తేదీలు, ప్రదేశాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. డప్పు చాటింపు ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను క్యాంపులకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు.

– క్యాంపుల్లో అవసరమైన సౌకర్యాలు,కౌంటర్లు : ప్రతి క్యాంపులో తప్పనిసరిగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. క్యాంపులకు వచ్చే ప్రజలు వేచి ఉండేందుకు సరిపడా సౌకర్యాలు కల్పించాలని, దరఖాస్తుల స్వీకరణకు ప్రతి క్యాంపులో అవసరమైన మేర కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాలు నమోదు చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దరఖాస్తుల స్వీకరణ, పత్రాల పరిశీలన, ఆధార్ ధ్రువీకరణ, నామినీ వివరాల నమోదు ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు.వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక సహాయం అందించాలని తెలిపారు. ప్రతి క్యాంపులో తాగునీరు, కుర్చీలు, విద్యుత్, ఇంటర్నెట్, ప్రింటర్, పవర్ బ్యాకప్ వంటి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు.

– కంప్యూటర్లు, సాంకేతిక పరికరాల ఏర్పాటు : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపుల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, ప్రింటర్లు, ఇతర సాంకేతిక పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.(ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

– పథకం అర్హతలు,బీమా వివరాలు : ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.కుటుంబంలోని సంపాదించే సభ్యుని వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని, 19-11-1967 నుంచి 18-11-2008 మధ్య జన్మించిన వారు అర్హులని వివరించారు.వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు. ఆధార్ కార్డులో కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉన్న సందర్భంలో జూలై 1వ తేదీని పుట్టిన తేదీగా పరిగణిస్తారని పేర్కొన్నారు.పథకంలో ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత బీమాదారుడు వయోపరిమితిని దాటినా కనీసం ఒక సంవత్సరం పాటు పూర్తి బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఇతర జిల్లాలకు చెందిన ఆహార భద్రత కార్డులు కలిగిన కుటుంబాలు కూడా తమకు సమీపంలోని క్యాంపు కేంద్రంలో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.